# భజగోవిందము

(శ్రీ శంకరాచార్యుల వారి విరచితము)

చెఱుకుపల్లి జమదగ్నిశర్మ



తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి

# భజగోవిందము

[శ్రీ శంకరభగవత్పాదాచార్య విరచితము]

వ్యాఖ్యాత:

శ్రీ చెఱుకుపల్లి జమదగ్ని శర్మ

ప్రచురణ

కార్యనిర్వహణాధికారి,

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

**2006**

# BHAJAGOVINDAMU

Srimad Sankara Bhagavad Padacharya

*Translation and Commentary*
**Cherakupalli Jamadagni Sarma**

*Edited by*
**M. Ramakrishna Sastry,**
**Mudivarthi Kondamacharyulu**

© All Rights Reserved

T.T.D. Religious Publications Series No : 320

First Edition : 1987
Re-Prints : 1996, 2003, 2005, 2006 2008

Copies : 5,000

Published by
**Sri K.V. Ramanachary,** IAS
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati — 517 507

*Printed at*
Keerthi Offset, Tirupati
Tirupati.

# ముందుమాట

భారతీయ వాఙ్మయంలో ప్రముఖస్థానాన్ని ఆక్రమించింది వేదాంతం. భారతీయ వేదాంతంలో ముఖ్యంగా ద్వైతాద్వైతవిశిష్టా ద్వైతాలు వ్యాప్తిలో ఉన్నవి. ఒకప్పుడు మతాంతరాలవల్ల వైదిక మతానికి విచ్ఛిత్తి కలుగుతూంటే తన్నివారణార్థం పరమేశ్వరుడే శ్రీశంకర భగవత్పాదులుగా అవతరించారని, ఇతర దుర్మతాలను ఖండించి అద్వైతమతాన్ని స్థాపించారని ప్రతీతి.

శ్రీశంకరభగవత్పాదులు ముప్పది రెండేడులే జీవించినా, ఆ కొద్దికాలంలోనే వారు పలుసార్లు దేశాటనంచేసి దుర్మతాలను ఖండించి తమ మతాన్ని స్థాపించారు. అందుకనే వీరిని 'అద్వైతమత స్థాపనాచార్యు'లని అంటారు. శ్రీభగవత్పాదాచార్యులవారు అద్వైతమత వ్యాప్తికై ఎంతో వాఙ్మయాన్ని కూడ సృజించారు. వీరి బ్రహ్మసూత్ర భాష్యం, గీతాభాష్యం మున్నగునవి అద్వైతులకు కొంగుబంగారంగా విరాజిల్లుతున్నవి. ఇంతేకాక అనేక స్తోత్రాలు, ఎన్నోముక్తకాలు రచించి సర్వదేవతాసామరస్యాన్ని నెలకొల్పారు. వీరి రచనలలోకెల్లా భజగోవింద శ్లోకాలు ఆకృతిలో చిన్నవయినా అర్థగాంభీర్యంలో, వైరాగ్యప్రబోధంలో అత్యున్నతస్థానాన్ని అందుకొన్నవి. కొద్దో గొప్పో ఆస్తికబుద్ధిగల ప్రతిభారతీయుని నోట ఈ శ్లోకాలు వినవస్తుంటాయి. స్త్రీలు సైతం వీటిని ప్రతిదినం వల్లించుకుంటూ పనిపాటలు చేసుకుంటూండడం పరిపాటి. ఈ శ్లోకాలు భారతీయేతరుల మనస్సులను కూడ అయస్కాంతంలాగా ఆకర్షించాయి.

భజగోవిందం శ్లోకాలు కొన్నింటిని ఆచార్యులవారు, మరి కొన్నింటిని వారి శిష్యులు చెప్పారనీ, శిష్యులు చెప్పిన శ్లోకాలవల్ల వారి మనఃపరిణతి నెఱింగి ఆచార్యులవారు సంతృప్తులైనారని పండితప్రకాండుల అభిప్రాయం.

తి.తి.దే.వారు సలుపుతున్న ధర్మప్రచారానికి, భక్తిప్రబోధానికి ఈ చిన్నపొత్తం ఎంతైనా ఉపయోగపడగలదని దీనిని స్వీయప్రచురణగా స్వీకరించడం జరిగింది. భక్తుల ఆదరాభిమానాలను ఈ గ్రంథం చూరగొనగలదని మా విశ్వాసం. లోగడ ప్రచురించిన ప్రతులు చెల్లిపోయిన కారణాన మళ్లీ పునర్ముద్రిస్తున్నాం.

కార్యనిర్వహణాధికారి
తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి.

# భజగోవింద శ్లోకములు

పరమశివావతారులైన ఆదిశంకరులు లోకానుగ్రహ బుద్ధితో చెప్పిన ప్రక రణ గ్రంథాలు అసంఖ్యాకంగా ఉన్నాయి. వాటిల్లో ఈ భజగోవిందశ్లోకాలు జగత్ప్రసిద్ధమైనవి. పూర్వం మనదేశంలో ఇవి రానివాళ్ళు ఉండే వాళ్ళేకారు. ఇవి తత్త్వాన్ని మననం చేసుకోవడానికి ఎంతో ఉపకరిస్తాయి. హాయిగా పాడుకోవడానికి వీలుగా ఉంటాయి. ఈ శ్లోకాలను పఠించుకుంటూ తత్త్వ విస్మృతి పొందకుండా ఎప్పటికప్పుడు మనస్సునకు హితాన్ని చెప్పుకుని స్వాధీనంలో పెట్టుకుంటూ పరమార్థాన్ని అందుకోవచ్చును.

ఈ శ్లోకాలకు మోహముద్గర మన్న పేరున్నది. ముద్గరమంటే సమ్మెట. మోహాన్ని నిర్మూలించడానికి ఇవి సమ్మెటపెట్టులా పనిచేస్తా యన్నమాట. వాటి కా శక్తి అందలి అర్థాల్ని లోతుగా మననం చెయ్యడం వల్ల వస్తుంది. వట్టి నోటిపాటవల్ల రాదు. ఇవి పైకి ముక్తకాలుగా కనిపిస్తాయి. అంటే ఏ శ్లోకాని కది స్వతంత్రంగానే ఉన్నట్లు తోస్తుంది. మిక్కిలి తేలికైన మాటలతో చాల సులభంగా ఉంటాయి. కాని బుద్ధిపెట్టి విచారిస్తే గంభీరార్థ సంభరితాలు కావడమేకాక చక్కని అనుగతి కనిపిస్తుంది. అనుభవజ్ఞులైన పెద్దలు చెప్పిన వాటినిబట్టి వీనినొక క్రమంలోపెట్టి యథాశక్తిగా అర్థాన్ని వివరించే ప్రయత్నం చేస్తాను.

ఈ శ్లోకాలు ఆవిర్భవించిన సందర్భాన్ని ఒక రకంగా ఊహించవచ్చు. శ్రీశంకరులు సశిష్యంగా కాశీలో కొన్నాళ్ళున్నారు. కాశీ ఆ రోజుల్లో సర్వ విద్యాకేంద్రంగా ఉండేది. ఇప్పటికీ ఆ ఖ్యాతిని నిలబెట్టుకుంటూనే ఉన్నదనుకుంటాను. అది ఎంత పుణ్యక్షేత్రమైనా అక్కడ ఉన్నవాళ్ళందరికీ పరమార్థదృష్టి ఉండడం సాధ్యం కాదు. ఎంతసేపూ విద్య లార్జించి పేరుప్రతిష్ఠలు పొంది ఐశ్వర్యవంతులై ఇహసుఖాలు పొందాలన్న తహ

తహ కలవాళ్లే ఎక్కువమంది ఉంటూ ఉంటారు. ఆ క్షేత్ర మెంత విఖ్యాతి పొందినదైనా అప్పుడూ ఇప్పుడూ ఇరుకు సందులతో సమ్మర్దంగానే ఉంటున్నది. ఇంటికీ వీథికీ వ్యత్యాసమే లేని పరిస్థితి. ఇంటిలో ఏ మూలనో కూర్చుని చదువుకుంటున్నా వీథిన పోయేవాళ్లకు వినిపిస్తూనే ఉంటుం దన్నమాట. శ్రీశంకర భగవత్పాదులవారు శిష్యులతో భిక్షాటనకు వెళ్తున్నప్పుడు ఎవడో పరమవృద్ధుడు ఇంట్లో కూర్చుని డుకృఞ్ కరణే - డుకృఞ్ కరణే అంటూ వ్యాకరణ సూత్రాలు వల్లె వేస్తూ ఉండడం వినిపించి ఉంటుంది. మనిషి కనిపించకపోయినా వినిపిస్తున్న గొంతునుబట్టి ఆ వల్లెవేస్తున్నది పరమవృద్ధని ఆయన గ్రహించి ఉంటారు. ఆ వృద్ధుని మౌఢ్యానికి ఆ జగద్గురువులకు తీవ్రమైన ఆవేదన కలిగి ఉంటుంది. వెంటనే వారు ఆవేశంలో ఈ శ్లోకాలు చెప్పడానికి పూనుకుని ఉంటారు. వీనిలో 'భజ గోవిన్దం భజ గోవిన్దం గోవిన్దం భజ మూఢమతే' అన్న మొదటి శ్లోకం పల్లవి. దీన్ని తరువాతి శ్లోకా లన్నిటితోనూ చదువుకుంటూ ఉండాలి. ఇక్కడ ఇస్తున్న కూర్పులో మొదటి పంద్రెండూ శ్రీశంకరులే చెప్పినట్లుగా ప్రసిద్ధి వహించాయి. పదమూడవది వారే చెప్పిన ఫలశ్రుతి. తరువాతి పదునాలుగు శ్లోకాలను పదునలుగురు శిష్యులూ చెప్పారని ప్రతీతి. ఏ శిష్యుడేది చెప్పిందీ గుర్తించడం కష్టం. వాటిని శిష్యులు చెప్పారన్న ప్రతీతి ఉన్నా ఆచార్యులు చెప్పిన వాటికే మాత్రమూ తీసిపోనట్లే ఉండడం వాటి విశేషం. ఈ శిష్యులు వీటిని చెప్పడంలో ఆచార్యోపదేశాన్ని తాము ఒంటబట్టించుకుని లక్ష్య సాధనకై తాము తీవ్రసాధన చేస్తూనే ఉన్నామని గురుపాదులకు హామీఇవ్వడమే తాత్పర్యమని తోస్తుంది. వారి హామీలు విన్న తరువాత సంతోషించిన ఆచార్యులవారు చివరినాలుగూ చెప్పి ఆశీర్వదించినట్లుగా భావించవచ్చును. ఇక్కడ వ్యాఖ్యానిస్తున్న 31 శ్లోకాలు మాత్రమే కాక ఇంకా ఒకటి రెండు వీటిలో చేర్చవలసినవి భిన్న ప్రాంతాల్లో లభిస్తున్న పాఠభేదాల్లో కనిపిస్తున్నాయి. వాటిని గూడా సందర్భాన్నిబట్టి వీటితో చేర్చుకుని చదువుకోవచ్చును.

భజ గోవిన్దం భజ గోవిన్దం
గోవిన్దం భజ మూఢమతే,

3

సంప్రాప్తే సన్నిహితే కాలే
నహి నహి రక్షతి డుకృఞ్ కరణే.

భజ గోవిందం=గోవిందుని భజింపుము; భజ గోవిందం=గోవిందుని భజింపుము; మూఢమతే=ఓయి మూఢమతీ; గోవిందం భజ=గోవిందునే భజింపుము; కాలే=మృత్యుసమయము; సంప్రాప్తే=వచ్చినపుడు; సన్నిహితే=లేదా సమీపించినపుడు, డుకృఞ్ కరణే=నీవు చదువుచున్న వ్యాకరణ సూత్రము; నహి నహి రక్షతి=ని న్నెంత మాత్రము రక్షింప లేదు.

శ్రీ శంకరులకు స్వశిష్యులు మాత్రమే శిష్యులు కారు. వారు జగద్గురువు లవడం చేత లోకమంతా వారికి శిష్య ప్రాయమే. హే మూఢమతే= ఓరీ బుద్ధిహీనుడా! అని తీవ్రంగా సంబోధించడంలో వారి అపారమైన వాత్సల్యం వ్యక్తమవుతుంది. మనయందు జాలి కలిగి మనం బాగుపడాలన్న తహతహ గల పెద్దలకే మనల నట్లా హెచ్చరించే సాహసం కలుగుతుంది. శంకరవాణి పరమ గంభీరమైనది. ఈ సంబోధన ఎవరినో, ఉద్దేశించిన దని కూడా అనుకోనక్కరలేదు. ఎవరికి వారు మూఢమయిన తమ మనస్సునే తాము హెచ్చరిస్తున్నట్లూ భావించవచ్చును. "ఓ మూర్ఖమైన మనస్సా! గోవిందుణ్ణి భజించుకో - గోవిందుణ్ణి భజించుకో - గోవిందుణ్ణే భజించుకో! ఎందుచేత నంటే తప్పనిసరి అయిన మృత్యువు వచ్చి పట్టుకునేటప్పుడు ఈ వ్యాకరణ సూత్రాలు నిన్ను రక్షించవు, రక్షించవు." ఇక్కడ గోవిందు డనగానే చతుర్భుజుడైన విష్ణువు మాత్రమే అని భ్రాంతి పడగూడదు. గోశబ్దాని కనేకార్థా లున్నాయి. గోవు లనగా ఇంద్రియాలు. సర్వేంద్రియ ప్రవర్తకుడైన అంతర్యామి రూపుడైన పరమాత్మ అన్నమాట. గోవులనగా వేదాలు. వేదములవల్లనే తెలియదగిన పరమాత్మ అన్నమాట. గోవులనగా కిరణాలు. స్వయంప్రకాశ స్వరూపుడైన పరమాత్మ అన్నమాట. అయినను ఏ ఇష్టదైవ రూపంలోనైనా ధ్యానించవచ్చు లేదా నిర్గుణ పరమాత్మనే ఉపాసించ వచ్చు. మరి గోవింద శబ్దాన్నే ఉపయోగించడంలో ఆచార్యుల వారు తమ గురుపాదులైన గోవింద భగవత్పాదాచార్యులవారి పవిత్రస్మృతికి దీన్ని అంకితం చేస్తూ తమ గురుభక్తిని ప్రదర్శించుకుంటూ అట్టి పరమమైన

గురుభక్తిని సర్వ్వులూ కలిగి ఉన్నప్పుడే తరిస్తారని సూచిస్తున్నట్లు భావింపవచ్చును. ఈ శ్లోకం పల్లవి వంటిది. తరువాతి అన్ని శ్లోకాలతోనూ దీన్ని పఠించుకుంటూ ఉండాలి.

మూఢ జహీహి ధనాగమ తృష్ణాం
కురు సద్బుద్ధిం మనసి వితృష్ణామ్,
యల్లభసే నిజ కర్మోపాత్తం
విత్తం తేన వినోదయ చిత్తమ్. 1

మూఢ=ఓయి బుద్ధిహీనుడా; ధనాగమ తృష్ణాం=ధనము వచ్చుచుండవలెననెడి దురాశను; జహీహి= విడిచిపెట్టుము; వితృష్ణాం=దురాశను విడిచిన; మనసి=మనస్సునందు; సద్బుద్ధిం=సత్పదార్థమును గూర్చిన ఆలోచనను; కురు=చేయుము; నిజ కర్మోపాత్తం=నీవుచేయు కర్మనుబట్టి; యత్=ఏ; విత్తం=ధనము; లభసే= లభించుచున్నదో; తేన=దానిచేత; చిత్తం=నీ మనస్సును, వినోదయ=ఆనందింపజేసికొనుము.

ఓయి మూఢుడా! ధనం రావాలన్న దురాశను విడిచిపెట్టు. ఆశా పీడితం కాని మనస్సులో సత్పదార్థాన్ని నిలుపుకో! నీ కర్మ ననుసరించి లభించే విత్తంతో తృప్తిపడి మనస్సు నానందింప చేసుకో!

శరీరయాత్ర గడపడానికి ధనం కావాలి. ధనం లేనిదే ఈ లోకంలో ఏమీలభించదు. అందుకనే 'ధనమూల మిదం జగ'త్తనడం. అందుచేత ఆచార్యులవారు ధన ముపయోగించ వద్దనడం లేదు. వస్తున్న ధనాన్ని వద్దని తోసి వెయ్యమనీ చెప్పడంలేదు. అది ఇంకా ఇంకా వస్తూ ఉండాలన్న దురాశనే విడిచి పెట్టుమంటున్నారు. ఆ ఆశ తొలగినప్పుడు మనసు విశ్రాంతిగా వుంటుంది. నిజానికి మనం తృష్ణ పెంచుకుని అనవసరంగా వెంపరలాడుతామే గాని మన కర్మ ననుసరించి మన కెంత ప్రాప్తించవలెనో అంతే వస్తుంది. రానిది రావాలని ఎంత వెంపరలాడినా రాదు. వచ్చేదాన్ని వద్దన్నా వెంబడి పడుతుంది. ఈ తత్త్వం తెలిసిన వాళ్లు "ప్రారబ్ధం పుష్యతి వపుః" అని నిశ్చితంగా తమ ధర్మాన్ని తాము నిర్వర్తించుకుంటూ వుంటారు.

అలా ఏ ఆందోళనా లేని నిండు మనస్సుతో చేసిన ధర్మానుష్ఠానమే దేహధారికి తరణ హేతు వవుతుంది.

నారీ స్తనభర నాభీదేశం
దృష్ట్వా మాగా మోహావేశమ్,
ఏత న్మాంస వసాది వికారం
మనసి విచిన్తయ వారం వారమ్. 2

నారీ=స్త్రీలయొక్క; స్తనభర=వక్షోజములతో నిండిన; నాభీదేశం=బొడ్డున కెగువ నున్న ఆకర్షించు శరీరమును; దృష్ట్వా=చూచి; మోహావేశం=వెఱ్ఱెత్తించు ఆవేశమును; మా గాః=పొందవద్దు; ఏతత్=ఇది యంతయు; మాంస+ వసా+ఆది=మాంసము, క్రొవ్వు మొదలైన కశ్మల పదార్థముల; వికారం=మారురూపే అని, మనసి=మనస్సు నందు; వారం వారం=మాటి మాటికిని; విచిన్తయ=లెస్సగా తలపోయుము.

ఈ సృష్టిలో మనసును మోహపరిచేది మొదటిది ధనమయితే రెండవది స్త్రీ. అందుకే కాంతా కనకాలు పరమ ప్రమాదకారులని పెద్ద లనడం. పురుషుల విషయంలో స్త్రీ మోహకారిణి అయితే స్త్రీల విషయంలో పురుషుడు మోహకారి. ఇందులో స్త్రీ స్వరూపమే వర్ణితమైందని శంకరులు స్త్రీ ద్వేషు లనుకోగూడదు. వారెంత సర్వసంగ పరిత్యాగులైనా ఒక తల్లి కడుపున పుట్టినవారే! ఆ తల్లిని అత్యంత భక్తితో సేవించుకున్నవారే! కామభావం మనసును మోహితం వెయ్యకుండా జాగ్రత్తపడాలనే వారి హెచ్చరిక. డబ్బు విలువ చాల చిన్నతనం నుండి తెలుస్తుంది. కొంత వయసు వస్తేనే గాని కామభావం ప్రబుద్ధం కాదు. అందుచేత ముందు అర్థాన్ని నిరసించి తరువాత కామాన్ని నిరసిస్తున్నారు. ముందుపుట్టిన చెవులకన్న తరువాత పుట్టిన కొమ్ములే వాడి అన్నట్లు అర్థం కంటె కామమే మనిషి నెక్కువ బలీయంగా మోహ పరుస్తుంది. కొంచె మాలోచిస్తే ఆ మోహమెంత అర్థంలేనిదో తెలుస్తుంది. ఓహోహో అని మనం వర్ణించుకునే సౌందర్యం యావత్తూ ఏమిటని విచారిస్తే తేలేది మల మూత్ర రక్త మాంసాస్థి కశ్మల పదార్థాలతో కూడిన తోలుతిత్తి అని విస్పష్టమవుతుంది. అందుచేతనే

"సుందరమయిన అవయవాలను చూచి మోహావేశాన్ని పొందవద్దు. ఇవన్నీ మిక్కిలి అసహ్య కరాలైన కశ్మల పదార్థాలే అని తిరిగి తిరిగి మనస్సుకు బుద్ధి చెప్పుకో" అంటున్నారు. అలా చెప్పుకుంటేనే వైరాగ్యం స్థిర మవుతుంది.

పూర్వమొక రాజు ఉండేవాడు. ఆయనకు స్త్రీ మోహం విపరీతంగా ఉండేది. ఆయన కంటబడిన అందగత్తెను అనుభవించకుండా వదిలేవాడు కాదు. అందుచేత అతని రాజ్యంలో స్త్రీల బ్రతుకు దుర్భర మైపోయింది. అలా ఉండగా ఒకమాటు ఆయన చూపు తలంటి పోసుకుని ఉదయపు ఎండలో మిద్దెమీద జుట్టు ఆరబెట్టుకుంటున్న ఒకానొక వైశ్యసుందరిమీద పడింది. రాజు వెంటనే ఆమె తండ్రికి కబురంపించాడు ఆమెను తన అంతఃపురానికి పంపమని. ఇదేం కర్మమా అని ఆ తండ్రి హడలిపోతూ కుమార్తెకు రాజాజ్ఞ తెలియజేశాడు. ఆమె చాలా తెలివిగలది. తండ్రికి ధైర్యం చెప్పి "ఒకవారం రోజులలో నేనే వస్తాననీ పల్లకీలు పంపమనీ కబురుచెయ్యండి నాన్నగారూ" అన్నది. తండ్రి అలాగే కబురు చేశాడు రాజుకు. తన నిర్బంధంతో నిమిత్తం లేకుండా స్వయంగా వస్తానంటున్నప్పుడు తొందరపడడం ఎందుకని ఎంత తహతహగా ఉన్నా రాజూ ఓపికతో ఎదురు చూడసాగాడు. ఈ వారంరోజులలోనూ ఆ సౌందర్యవతి తన సౌందర్యాన్ని రెండు బంగారు బిందెల్లో నింపే ప్రయత్నం చేసింది. రోజూ ఆముదం పుచ్చుకోవడం, ఉప్పునీళ్ళు త్రాగడం. విరేచనాలూ డోకూలూ అవుతూ ఉంటే వాటి నా బిందెల్లో పట్టడం. ఇలా వారం రోజులు గడిచేటప్పటికి ఆమె వేలాడిపోయి వట్టి ఎముకల గూడయింది రాజుగారి పల్లకీలు రాగానే మేలిముసుగు వేసుకుని చెలికత్తెల సాయంతో ఒక దాంట్లో తానెక్కి మరొక దాంట్లో పట్టుగుడ్డలు కప్పిన ఆ బంగారు బిందెలు పెట్టించి సరాసరి రాజాంతఃపురం చేరుకున్నది. ఎక్కడలేని తహతహతోనూ ఆమెను చూడడానికి వచ్చిన రాజుకు మేలిముసుగు తీస్తే కనిపించింది, తాను వెనుక చూచిన సౌందర్యవతి కాదు. మరెన్నడూ చూడగూడదనుకునే పరమ వికారదుస్సహ స్వరూపం! రాజు హడలిపోయి "ఏమైంది నీకు? ఏమైంది నీకు?" అని ఆవేదనపడ్డాడు. "ఏమీకాలేదు రాజా! నా సౌందర్యా న్నంతటినీ తమకు సమర్పించాలని వేరే బిందెలతో పట్టించాను.

చిత్తగించం"డని ఆ బిందెలను ఎదుట పెట్టించింది. "ఈ పదార్థాలే నా శరీరంలో వున్నప్పుడు నేను మీకు అందంగా కనిపించాను. వాటిని తీసేస్తే ఇలా తయా రయ్యాను" అంటూ గాంభీర్యం వహించింది. ఆయన మోహితుడేకాని దుష్టుడు కాకపోవడంచేత వివేకం తెచ్చుకుని సౌందర్యసారం నాకిప్పు డవగతమైందని ఒప్పుకుంటూ "తల్లీ! క్షమించు"మని ఆమె కాళ్ళపైపడి వేడుకుని ఆమెను సకల మర్యాదలతోనూ పుట్టింటికి పంపించాడు.

కాబట్టి సౌందర్య మెన్నడూ వస్తునిష్ఠమై వుండడం లేదు. మోహితమయ్యే మనస్సునందే వుంటున్నది. తత్త్వం విచారిస్తే మనస్సు ఆ మోహాన్ని వదలుకో గలదు.

నలినీదళ గత జల మతితరళం
తద్వ జ్జీవిత మతిశయ చపలమ్,
విద్ధి వ్యాధ్యభిమాన గ్రస్తం
లోకం శోక హతం చ సమస్తమ్. 3

నలినీ=తామరతీగయొక్క; దళ=ఆకునందు; గత=పొందియున్న, జలం=నీరు, అతితరళం=ఎంత నిగనిగలాడినను మిక్కిలి చలించువది; తద్వత్=అదే విధముగా, జీవితం=ఈ బ్రతుకు, అతిశయ=మిక్కిలిగా, చపలం=మెరుపువలె మెరిసి మాయ మగునది (అంతేకాక శరీరము); వ్యాధి=రోగములచేతను, అభిమాన=నాది, నావారు అను అభిమానములచేతను, గ్రస్తం=చుట్టబడినది; లోకం=జీవితరంగస్థలమైన లోకము, సమస్తం చ=అంతయును; శోకహతం=దుఃఖమయమైనది (అని), విద్ధి=తెలిసికొనుము.

శరీరం ధరించి బ్రతికి ఉంటున్నాం కాబట్టి అర్థకామాలకు వశులమై మూఢుల మవుతున్నాం. ఇప్పు డర్థకామాల తత్త్వం తెలుసుకుని ఆ మోహం విడిచా మనుకుందాం. పోతే ఈ బ్రతుకు సుఖహేతువా అంటే అదీ కాదు. ఈ జీవితం తామరపాకు మీది నీటివలె మిక్కిలి తరళమైనది. లోపల చైతన్య మున్నంత కాలమే తళతళ మెరుస్తూ ఉంటుంది. ఎప్పు డది విడిచి పోతుందో ఎవ్వరూ చెప్పలేరు. తామరపాకు గాలి కూగుతూ

ఉండి అటూ ఇటూ ఒరుగుతున్నప్పుడు అందలి నీటిబొట్టు అంతవరకు తళతళా పాదరసంలా మెరుస్తున్నది, ఎప్పుడు రాలిపోతుందో తెలియనట్లు ఈ శరీరంలోని చైతన్యం ఎప్పు డెగిరిపోతుందో చెప్పలేము. ఉన్నప్పుడైనా జీవితం సుఖహేతువు కావడంలేదు. శరీర మెప్పుడూ వ్యాధిచేతా, అభిమానం చేతా గ్రస్తమై వుంటున్నది. ఈ లోకమూ, ఈ లోకంలో శరీరాన్ని ధరించి మనం బ్రతికే బ్రతుకు, సమస్తమూ శోకహతమై ఉన్నాయని తెలుసుకుని వాటి మీది మోహాన్ని గూడా వదులుకోవాలి. అప్పుడే ఈ శరీరాన్ని ఎలా సద్వినియోగం చేసుకోవాలో తెలుస్తుంది.

'జాతస్య మరణం ధ్రువం' అన్న సూక్తి అందరికీ తెలిసిందే. పుట్టిన శరీరం గిట్టక తప్పదు. క్రమక్రమంగా శిథిలమయి పోయేది కాబట్టే దానికి శరీర మన్న పేరు ఏర్పడింది. మొదట్లో కొన్నాళ్ళు వృద్ధి పొందుతుంది. అప్పుడది దేహం. పెరగడం మాని విశీర్ణ మవడాని కుపక్రమిస్తుంది. అప్పుడది శరీరం. ఏళ్ళు వస్తున్న కొద్దీ నా కిన్నో యేడు, నా కిన్నో యేడు అని పుట్టినరోజు పండుగలు చేసుకుంటూ కులుకుతూ ఉంటామే గాని మృత్యువునకు సన్నిహిత మవుతున్నామన్నమాటే విస్మరిస్తూ ఉంటాము. భగవంతు డిచ్చిన సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోక ఆయుర్దాయాన్ని వ్యర్థం చేసుకుంటున్నామని విచారించక ఇహభోగాలలో మునిగి తేలుతూ ఉంటాము. శరీరం వ్యాధిపీడితమని గుర్తిస్తూ వున్నా భార్యాపుత్త్రాదులచేత అభిమానిత మవుతున్నందువల్ల మనకేం పర్వాలేదనుకుంటూ ఉంటాము. మనం వారి నభిమానిస్తూ వారు మనల్ని అభిమానిస్తూ ఉంటే ఈ అభిమానాలు శాశ్వతంగా ఉంటాయని భ్రమిస్తూ ఉంటాము. ఇదంతా అవివేకం తప్ప మరేమీకాదు. ఈ శరీరంతో మన మిక్కడ పొందుతున్నది దుఃఖమేగాని సుఖ మే మాత్రమూ లేదు. ఏ కొంచెమైనా ఉన్నదనుకున్నా అది సూదికోసం దూలం మొయ్యడం వంటిదే గాని పడుతున్న శ్రమకు అనురూపమైంది కానే కాదు. అందుచేత యథార్థం గ్రహించి శరీరధారణావకాశాన్ని సద్వినియోగం చేసుకుని పొందవలసిన పరమార్థాన్ని పొందగలగాలి.

యావద్విత్తోపార్జన శక్త
స్తావ న్నిజ పరివారో రక్తః,
పశ్చా జ్జీవతి జర్జర దేహే
వార్తాం కోఽపి న పృచ్ఛతి గేహే. 4

యావత్=ఎంతవరకు, విత్త=ధనమును, ఉపార్జన=సంపాదించుటయందు, శక్తః=సమర్థుడవై యున్నావో, తావత్=అంతవరకే, నిజపరివారః=నీ బంధువర్గముగాని, నిన్ననుసరించువారు గాని, రక్తః=నీయందు ప్రీతిగలవారై యుందురు. పశ్చాత్=ఆపిమ్మట, జర్జర=ముసలితనముచే శిథిలమైన, దేహే=దేహమునందు, జీవతి=నీవు బ్రతికియే యున్నను, గేహే=నీ యింటియందు, కః+అపి=ఎవ్వరుగూడ, వార్తాం=నిన్నుగూర్చిన కుశలప్రశ్నను, న పృచ్ఛతి=అడుగనే అడుగరు.

ఎంతవరకీ శరీరంలో సంపాదించగల శక్తి ఉంటున్నదో అంతవరకే మనవాళ్లు మనల్ని అభిమానిస్తున్నారు. ఆ శక్తి ఉడిగిపోయిన తర్వాత శిథిలమైన శరీరంలో జీవు డుంటున్నప్పటికి వాణ్ణి గూర్చి ఇంట్లోవాళ్ళే పట్టించుకోరు. పైకి చెప్పరుగాని ఎప్పుడు వీణ్ణి పంపించేసి తెరిపిన పడదామా అని ఆ సమయంకోసం ఎదురుచూస్తుంటారు.

గడ మడుగ మగని జూచిన
నడుపీనుగు వచ్చె ననుచు నగుదురు సుమతీ!

అని ఆ అనుభవజ్ఞుడు ఊరకే అనలేదు. మనవాళ్ళకు మనమీదఉండే అభిమానం ఇంతమాత్రమే! ఇట్టి అభిమానాన్ని నిజ మనీ, శాశ్వత మనీ అనుకోవడం ఎంత వెఱ్ఱి? ఇది ఒకరిని గూర్చి ఒక రనే మాటకాదు. అందరి ఎడలా అన్నివేళలా సత్యమైన మాటే! ఒంట్లో శక్తిఉండి కష్ట పడి పని చేస్తున్నంత కాలమూ పోషించి పని చేస్తున్నంత కాలమూ పోషించి పనిచేయించుకున్న రైతు ఆ శక్తి తగ్గిపోతే ముసలిఎద్దును కబేళాకు తోలేస్తున్నాడు ఉపయోగిస్తున్నప్పుడు నెత్తిన పెట్టుకున్న వాటన్నిటినీ పనికిరానప్పుడు పారవెయ్యడం అంతటా జరుగుతూ ఉన్నదే! నిత్యమూ మనమీద ఆధారపడి మనవల్ల పైకి వచ్చిన మనవాళ్ళకే మనం పనికిరాక పోతున్నప్పుడు తక్కినలోకానికి మనలనుగూర్చి పట్టించుకోవలసిన అగత్య మేముంది?

కాదయ్యా లోకమంతా అలా ఎందుకుంటుంది? తండ్రి అనీ, భర్త అనీ, అన్న అనీ నిజమైన భక్తిశ్రద్ధలతో శరీరాన్ని రక్షించే వారు ఉండరా అంటే ఉండవచ్చు. ఉంటేమాత్రం ప్రయోజన మేమిటి? వాళ్ళు మాత్రం ఎంతవరకు చూస్తారు? ఏమి చేస్తారు? ప్రాణం ఉన్నంతవరకు శరీరాన్ని కాపాడుతారు. అంతకుమించి వాళ్ళు మాత్రం ఏమి చెయ్యగలరు? గడచిన కాలాన్ని మళ్ళించగలరా? పరమార్థానికి సహాయపడగలరా?

యావ త్పవనో నివసతి దేహే
తావ త్పృచ్ఛతి కుశలం గేహే,
గతవతి వాయౌ దేహాపాయే
భార్యా బిభ్యతి తస్మిన్ కాయే. 5

యావత్=ఎంతవరకు, పవనః=ప్రాణవాయువు, దేహే=శరీరమునందు, నివసతి=ఉంటున్నదో, తావత్=అంతవరకు మాత్రమే, గేహే=ఇంటిలోని వారైనను, కుశలం=బాగున్నారా అని, పృచ్ఛతి=అడుగుదురు. వాయౌ=ఆ ప్రాణవాయువు, గతవతి=వెళ్ళిపోయినది కాగా, దేహాపాయే=నీవు దేహము విడిచిపోగా, తస్మిన్+కాయే=ఆ శరీరమును చూచి, భార్యా=నిన్ను ప్రేమించిన భార్యకూడ, బిభ్యతి=భయపడుచున్నది.

ఎంతవర కీ బొందిలో ఊపిరి ఆడుతూ ఉంటుందో అంతవరకే ఇంట్లో వాళ్ళయినా మనలను బాగున్నావా అని కుశల ప్రశ్న చెయ్యగలిగేది. ఆ కాస్త ఊపిరీ పోయినప్పుడు మనతో మమేకమయి జీవితం గడపిన భార్య కూడా ఆ శరీరాన్ని చూచి భయపడి పారిపోతుంది. ఎంత త్వరగా శరీరానికి అంత్యసంస్కారం చేస్తామా అని తహతహలాడి పోతారు అందరునూ. ఉంచిన కొద్దీ శరీరం కుళ్ళి బ్రతికి ఉన్నవాళ్ళకు హానికర మయిపోతుంది. ప్రాణంతో శరీరంలో ఉన్నప్పుడు ఎవరిచేత ఎంత అభిమానితుడైనా ఆ తర్వాత దయ్యమై పీక్కుతింటాడేమో అని అందరికీ భయమే. ఇదీ ఈ జీవితాల్లో మనకూ మనవాళ్ళకూ ఉంటున్న అభిమానాల యథార్థ స్వరూపం!

అయినప్పటికీ బ్రహ్మానుభవయోగ్యమైన పరమోత్తమ మనుష్య శరీరాన్ని అదృష్టవశాత్తూ పొందిన మానవులు ఆ పరబ్రహ్మమునందు శ్రద్ధకలవాళ్ళు కాకపోవడం కంటె మూఢత ఇంకేముంటుంది?

బాలస్తావత్ క్రీడాసక్తః
తరుణ స్తావత్ తరుణీ సక్తః,
వృద్ధ స్తావత్ చింతా సక్తః
పరమే బ్రహ్మణి కోఽపి న సక్తః. 6

బాలః+తావత్=చిన్నతనములో ఉన్నవాళ్ళయితే, క్రీడా+ఆసక్తః=ఆట పాటల యందే ఆసక్తి కలవా రగుచున్నారు. తరుణః+తావత్=యౌవనములో ఉన్నవాళ్ళయితే, తరుణీ=స్త్రీలయందే, సక్తః=ఇష్టులైనవా రగుచున్నారు. వృద్ధః+తావత్=ముసలివాళ్ళ యితే, చింతాసక్తః=తీరని కోరికలనుగూర్చి చింతించుటయందే ఆసక్తు లగుచున్నారు. పరమే=పరమోత్కృష్టమైన, బ్రహ్మణి=బ్రహ్మపదార్థమునందు, కః+అపి=ఏ దశలో నున్నవారును, న సక్తః=ఆసక్తులే అగుటలేదు.

బాల్యంలో అందరూ ఆటపాటలయందే ఆసక్తులయి ఉంటారు. యౌవ నంలో అందరికీ సంసార సుఖాలమీదే అపేక్ష ఉంటుంది. ముసలితనంలో జీవితంలో చెయ్యలేకపోయిన వాటినిగూర్చి చింతిస్తూ ఉండడమే పని అవుతుంది. పరబ్రహ్మాన్ని గూర్చి ఎవ్వరూ ఆసక్తులు కానేకారు.

ఏ పూర్వజన్మ సంస్కారం చేతనో అపురూపంగా అట్టి ఆసక్తి ఎవరికైనా కలిగినా అట్టివారిని వారి పెద్దలే నిరోధించి సంసార బద్ధులను చేస్తూ ఉంటారు. పదిమందితో కలిసిమెలిసి తిరుగుతూ ఆట పాటలలో పాల్గొనక ఏకాంతప్రియు లయ్యే కుర్రవాళ్ళను చూచి తల్లిదండ్రులు పడే ఆందోళన ఇంతా అంతా కాదు. ఉపేక్షచేస్తే వాళ్ళు సన్న్యాసులై పోతారేమో అని వాళ్ళ కాటపాటలలో ఆసక్తి కలిగించడానికి రకరకాల ఉపాయాల నన్వేషిస్తారు. పెళ్ళిచేస్తే ఆ వైరాగ్యభావం నశిస్తుందని తొందరపడి పెళ్ళిళ్లు చేస్తారు. ఇవ్వప్పెట్టె తాళంచేతుల నప్పగించి బాధ్యతలు నెత్తినపెట్టి సంసారరక్తు లయేటట్లు చేస్తారు. ఎవరో బుద్ధ రామకృష్ణాదులవంటి మహానుభావులు తప్ప తక్కినవాళ్ళు పెద్దలు కల్పించే నిరోధాల నతిక్రమించి తప్పుకోలేరు. ఎందు కిలా జరుగుతోంది! అంతా అజ్ఞాన ప్రభావంచేతనే. సంసార స్వరూపం విచారిస్తే చెయ్యవలసిన కర్తవ్యం విస్పష్ట మవుతుంది.

కా తే కాన్తా కస్తే పుత్త్రః
సంసారోఽయ మతీవ విచిత్రః,
కస్య త్వం కుత ఆయాతః
తత్త్వం చిన్తయ తదిహ భ్రాతః. 7

తే=నీయొక్క, కాంతా=స్త్రీ, కా=ఎవరు? తే=నీయొక్క, పుత్త్రః=కుమారుడు కః=ఎవరు? అయమ్=ఈ, సంసారః=సంసారము, అతీవ=మిక్కిలి, విచిత్రః=విచిత్రమైనది. త్వం=నీవు, కస్య=ఎవరికి చెందినవాడవు? కుతః=ఎక్కడనుండి, ఆయాతః=వచ్చినవాడవు? భ్రాతః=ఓయి సోదరుడా, తదిహ=ఇప్పుడైనను, తత్త్వం=ఈ సంసార స్వరూపమును, ఆ బ్రహ్మస్వరూపమును, చిన్తయ=బాగుగా ఆలోచించి తెలిసికొనుము.

ఓయి సోదరుడా! తత్త్వాన్ని విచారించు. ఎవరు నీ భార్య? నీ పుత్త్రుడెవడు? ఈ సంసారం అత్యంత విచిత్రమైనది. ఇంతకూ నీ వెవరికి చెందిన వాడవు? ఎక్కడనుండి ఇక్కడకు వచ్చావు? ఈ తత్త్వవిచారణ చేస్తే నీ భ్రాంతి మోహాలు పటాపంచ లవుతాయి.

ఒక ఊళ్లో ఒకడు పుట్టాడు. మరి కొన్నాళ్ళకు మరొక ఊళ్లో ఒకామె పుట్టింది. వా రిరువురకూ వివాహమై భార్యభర్త లయ్యారు. వారికి సంతానం కలిగింది. పుత్త్రుడనీ పుత్త్రిక అనీ మోహపడుతున్నారు. విచారణచేస్తే ఈ శరీరాలతత్త్వం తెలుస్తుంది. పురుషుడు తిన్న అన్నం జీర్ణమయి రక్తంగా మారి వీర్యంగా పరిణమించి స్త్రీ గర్భంలో ప్రవేశించి శుక్లశోణిత సమ్మేళనం వల్ల పరమవిచిత్రంగా శరీర మవుతోంది. అన్ని శరీరాలూ అన్నమాయాలే; అంటే పాంచభౌతికాలే! ఆ పాంచభౌతికోపాధులలో చిత్ప్రతిబింబం ద్యోతకమైనప్పుడే అవి జీవించి నడయాడు తున్నాయి. చిదాభాసుడు లేనప్పుడే అవి జీవించి నడయాడు తున్నాయి. చిదాభాసుడు లేనప్పుడు ఎక్కడి కక్కడ విశ్లథమయి పంచభూతాల్లో విలీనమైపోతున్నాయి. అంటే ఒక మట్టి ముద్ద తాను భర్త ననుకుంటుంటే మరొక మట్టిముద్ద భార్య ననుకుంటున్నది. ఈ రెండూ కూడినందువల్ల ఏర్పడిన మరొక మట్టిముద్దను పుత్త్రుడనో పుత్త్రిక అనో ఆ రెండూ అభిమానిస్తున్నాయి. వీనిలో ఎవరెవరికి చెందినవారు? వీళ్లందరూ ఎక్కడనుండి వచ్చారు? ఒక్కసూర్యు డాకాశంలో ఉండగా

అనేక జలఘటాల్లో ప్రతిబింబా లేర్పడ్డట్టు చిదాభాసు లనేకులుగా స్ఫురింపగా ఎవరికి వారు దేహతాదాత్మ్యముతో వేరు వే రనుకుంటున్నారే గాని యథార్థాని కనేకు లెక్కడున్నారు? ఉన్నదొక్క సూర్యుడే కదా! కోట్లకొలది ఘటా లున్నంత మాత్రాన అన్నిటా ఆకాశ మున్నప్పటికీ ఆకాశాని కనేకత్వ మెట్లాలేదో చైతన్యానికీ అనేకత్వంలేదు. జీవు డాత్మ స్వరూపుడే అయి ఆత్మాన్యం ఏమీలేకపోయినప్పటికీ లేని దున్నట్లు కనిపింపచేసే మాయకు వశుడై శరీరేంద్రియాలతో తాదాత్మ్యం చెంది ఇది నా భార్య అనీ, వీడు నా పుత్త్రుడనీ మోహితు డవుతున్నాడు. ఇదంతా అహంకార మమకారాల చేత సంప్రాప్త మవుతున్న సంసారం. దీంట్లోనుంచి బయటపడడానికి అవలంబించవలసిన మార్గ మేమిటి?

సత్సంగత్వే నిస్సంగత్వం<br>
నిస్సంగత్వే నిర్మోహత్వమ్,<br>
నిర్మోహత్వే నిశ్చలతత్త్వం<br>
నిశ్చలతత్త్వే జీవన్ముక్తిః. 8

సత్=సత్పదార్థములోని, సంగత్వే=దృఢమైన సంబంధము వలన, నిస్సంగత్వం= మాయా ప్రపంచములోని సంబంధము తొలగిపోవును. నిస్సంగత్వే=ఆ విధముగా బంధము తొలగినప్పుడు, నిర్మోహత్వం=నాది వావారు అను మోహము తొలగిపోవును. నిర్మోహత్వే=అట్లు మోహము పోయినప్పుడు, నిశ్చలతత్త్వం=మనస్సు పరిశుద్ధమై నిర్వికారమైన ఆత్మతత్త్వము తెలియును. నిశ్చలతత్త్వే=అట్టి నిర్వికార స్థితిని పొందుటయే, జీవన్ముక్తిః= జీవించియుండగనే సర్వబంధములనుండి విముక్తి నందుట.

సత్సంగత్వాన్ని పొందాలి. సత్పదార్థంలో సంగాన్ని పెంచుకున్నందు వల్లనే మాయాప్రపంచంతోడి సంగం వదులుతుంది. సరాసరి సత్పదార్థ సంగం సామాన్యులకు సాధ్యం కాదు. నిత్యమైన సత్పదార్థ తత్త్వం తెలిసిన సత్పురుషులతోడి సాంగత్యం ప్రపంచం తోడి నిస్సంగత్వానికి దారితీస్తుంది. ఎప్పుడు నిస్సంగు లవుతారో అప్పుడు నిర్మోహత్వం సిద్ధిస్తుంది. మోహం తొలగిపోయినప్పుడు సిద్ధమైవున్న నిశ్చలతత్త్వం ప్రస్ఫుటమవుతుంది. అదే జీవన్ముక్తి.

కారణ నిర్మూలనతో కార్యం నిర్మూలిత మవటం సర్వత్రా ప్రస్ఫుట మవుతున్న సత్యమేకదా!

వయసి గతే కః కామ వికారః
శుష్కే నీరే కః కాసారః,
క్షీణే విత్తే కః పరివారః
జ్ఞాతే తత్త్వే కః సంసారః. 9

వయసి=కామభావమును గలిగించిన యౌవనము, గతే=వెళ్ళిపోగా, కామ వికారః= కామోద్రేకము, కః= ఎక్కడనుండును? (ఉండదు అని భావము), నీరే=నీళ్ళు, శుష్కే=ఎండిపోగా, కాసారః=చెరువు, కః=ఎక్కడ ఉండును? (గుంట ఉన్నను దానిని చెరు వనగూడదని భావము), విత్తే=ధనము, క్షీణే=నశించిపోగా, పరివారః=అనుసరించి ఉండువారు, కః=ఎక్కడ నుందురు? (ఉండరని భావము), తత్త్వే=బ్రహ్మసత్యత్వము జగన్మిథ్యాత్వము, జ్ఞాతే= బాగా తెలిసినప్పుడు, సంసారః=అజ్ఞాన జనితమైన సంసారము, కః=ఎక్కడ ఉండును? (ఉండదని భావము).

వయసుతో కలుగుతున్న కామభావం అదిలేనప్పు డుండడం లేదు. బాల్యంలోనూ వార్ధక్యంలోనూ కామభావం లేకపోతూ ఉండడానికి అది వయసుతో కలిగేది కావడమే హేతువు. చెరు వనడానికి హేతువైన నీరు ఎండిపోయాక చెరువని ఎలా వ్యవహరిస్తాము? నాలుగు పిక్కలు చేతిలో ఆడుతున్నప్పుడు చుట్టూ చేరే పరివారం అవి లేనప్పుడు దరిదా పుల్లో కూడా కనిపించదు కదా! అలాగే అజ్ఞానజనిత మోహభ్రాంతులవల్ల కలుగుతున్న సంసారతత్త్వం తెలుసుకోగానే పటాపంచ లయిపోతుంది. జ్ఞానభానూదయంతో సంసారాంధకారం మాయం కాకతప్పదు.

అందుచేత తత్త్వం తెలుసుకుని మోహం వదలుకుని నిత్య నిరతిశయ సుఖ స్వరూపమైన బ్రహ్మపదంలో సుప్రతిష్ఠితులం కావాలి.

మా కురు ధనజన యౌవన గర్వం
హరతి నిమేషా త్కాల స్సర్వమ్,
మాయామయ మిద మఖిలం బుద్ధ్వా
బ్రహ్మపదం త్వం ప్రవిశ విదిత్వా. 10

ధన=డబ్బునుగూర్చిన, జన=బలగమునుగూర్చిన, యౌవన=వయసునుగూర్చిన గర్వం=అన్నీ ఉన్నవాడనను ఎగిరిపాటును, మా కురు=పొందవద్దు. కాలః=కాలము, సర్వం=సమస్తమును, మాయామయం=ఉన్నట్లుతోచి కలలోని పదార్థములవలె మాయమగునదని, బుద్ధ్వా=తెలుసుకొని, త్వం=నీవు, బ్రహ్మపదం=నిత్యమైన బ్రహ్మస్థానమును, విదిత్వా=గ్రహించినవాడవై, ప్రవిశ=ప్రవేశించుము.

నాకింత ధనమున్నది, నా కింతమంది అండ దండగా ఉన్నారు, నేను మంచి యౌవనంలో శక్తి సామర్థ్యాలతో తులదూగుతున్నానని వాటిని గూర్చి వ్యర్థంగా గర్వించకు. వీటి నన్నిటినీ కాలం క్షణంలో హరించి వెయ్యగలదని తెలుసుకో! నిన్ను మోహంలో ముంచుతున్న ధనజన యౌవనాదులన్నీ మాయామయాలు. స్వప్నదృష్ట పదార్థాల్లా ఉన్నంతసేపూ నిజ మనిపిస్తూనే చటుక్కున మాయమయిపోతాయి. అందుచేత అనిత్యమైన మాయామయ జగత్తును నమ్ముకోక నిత్యమైన బ్రహ్మపదాన్ని తెలిసి చేరుకుని దానియందే పరినిష్ఠితుడవై ఉండు.

ఆ పని చెయ్యడానికి ఇప్పుడే తొంద రేమిటని బద్ధకించకు. కాలం నీ కోస మాగదు. అది దొర్లిపోతూనే ఉంటుంది.

దినయామిన్యౌ సాయం ప్రాతః
శిశిర వసన్తౌ పున రాయాతః,
కాలః క్రీడతి గచ్ఛ త్యాయుః
తదపి న ముంచ త్యాశావాయుః. 11

దినయామిన్యౌ=పగళ్లూ రాత్రులూ, సాయంప్రాతః=సాయంప్రాతస్సమయాలు, శిశిర వసన్తౌ=శిశిర వసంతఋతువులు, పున రాయాతః=తిరిగి తిరిగి వచ్చేవే, కాలః=కాలము, క్రీడతి=తన ధోరణిలో తాను తిరుగుచునే యుండును, ఆయుః=ఆయుర్దాయము మాత్రము, గచ్ఛతి=తెలియకుండగనే అయిపోవును, తత్+అపి=అట్లయి నప్పటికినీ, ఆశావాయుః=+భోగము లనుభవింపవలె ననెడి కోరికల రూపమైన ప్రళయ వాయువు, న ముంచతి=విడిచిపెట్టదు.

పగలు తర్వాత రాత్రి, సాయంకాలం తర్వాత ప్రాతస్సమయం, శిశిరం వెళ్లి వసన్తం- ఇలా గిరాగిరా తిరుగుతుండే చక్రంలా ఒకదాని తర్వాత

ఒకటివచ్చి పోతూనే ఉంటాయి. చూస్తూ చూస్తూ ఉండగానే నీకున్న ఆయు వయిపోతుంది. నీవు వైరాగ్య ఖడ్గంతో తెగించి తెంపుకోక పోతే ప్రభంజనంలా వీస్తూవుండే భోగాశావాయువు ఎన్ని జన్మలెత్తినా నిన్ను వదిలిపెట్టదు.

నే నిప్పుడే వైరాగ్యాన్ని అవలంబిస్తే నా పెళ్లాం బిడ్డ లే మవుతారని వారికోసం నిన్ను నీవు నాశనం చేసుకోకు.

కా తే కాన్తా ధనగత చిన్తా
వాతుల కిం తవ నాస్తి నియన్తా,
త్రిజగతి సజ్జన సంగతి రేకా
భవతి భవార్ణవ తరణే నౌకా. 12

తే=నీయొక్క, కాంతా+ధన+గత+చింతా=భార్యాపుత్రాదులకు ధనమునకు సంబంధించిన విచారము, కా=ఏమి? (ఎందుకు) అని అర్థము, వాతుల=మూర్ఖుడా, తవ=నీకు, నియన్తా=సర్వజీవపోషకుడైన ఈశ్వరుడు, నాస్తి కిం=లేదా ఏమి? త్రిజగతి=మూడులోకముల యందును, సజ్జన సంగతిః=బ్రహ్మవేత్తలైన మహాత్ముల తోడి సాంగత్యము, ఏకా=ఒక్కటియే, భవ=సంసారమనెడి, అర్ణవ=సముద్రమును, తరణే=దాటించుటకు, నౌకా=పడవ, భవతి=అగుచున్నది.

ఈషణ త్రయంతో నిన్ను నీ వెందుకు బంధించుకుంటావు? సర్వ జీవ పోషకుడైన జగన్నియామకుడు లేదా? "నేను సన్న్యాసినైతే నా భార్యా పుత్త్రులేమవుతారు? వారికి అవసరమైన ధనాన్నైనా నేను సమకూర్చి పెట్టలేదే?" ఇట్టి ఆలోచనలతో నిన్ను నీవు బంధించుకోకు. వట్టి మమకారంతో వారి భారాన్ని నీవు వహిస్తున్నానని అనుకుంటున్నావు. కాని నిజంగా వహిస్తున్నది నీవు కానేకాదు. వారివారి ప్రారబ్ధాలే వారిని భరిస్తున్నాయి. కర్మఫల ప్రదాత అయిన భగవంతుడే ఆ బాధ్యత వహిస్తున్నాడు. కడుపున బడ్డ బిడ్డకు తల్లి రొమ్ముల్లో పాలు నింపి సిద్ధం చేస్తున్న దెవరు? ఆహారం నమిలి మింగేందుకు సమయానికి పళ్ళు మొలిపిస్తున్న దెవరు? ఎప్పటికప్పుడే ఏవి అవసర మవుతాయో వాటి వాటిని తనకు తానుగానే సిద్ధంచేస్తున్న పరమేశ్వరు డుండగా నీ కనవసరమైన ఈ చింత లెందుకు?

నీవు నిజంగా సంసార సముద్రాన్ని తరించ దలుచుకుంటే దాన్ని దాటించే నౌక అయిన సజ్జనసాంగత్యాన్నొక్కదాన్నే ఆశ్రయించు. అంతకుమించి ఈ మూడు లోకాల్లోనూ మరొక మార్గమేలేదు.

ద్వాదశ మంజరికాభి రశేషః
శిష్యాణాం కథితో హ్యుపదేశః,
యేషాం నైష కరోతి వివేకం
తేషాం కః కురుతా మతిరేకమ్. 13

ద్వాదశమంజరికాభిః=పుష్పగుచ్ఛములవంటి ఈ పన్నెండు శ్లోకములతోను శిష్యాణాం=శిష్యులకుగాను, అశేషః=చెప్పవలసినది మిగల్పని, ఉపదేశః=ఉపదేశము, కథితః+హి=చెప్పబడినది గదా! ఏషః=ఈ ఉపదేశము, యేషాం=ఎవరికి, వివేకం=వివక్త జ్ఞానమును, న కరోతి=కలిగించుట లేదో, తేషాం=వారికి, అతిరేకం=ఇంతకుమించి, కః=ఏమిటి, కురుతామ్=చేయగలము?

అనుభవసార మధువులోకూడిన పుష్ప గుచ్ఛాలవంటి ఈ పన్నెండు శ్లోకాలతోను శిష్యుల కందించవలసిన ఉపదేశాన్ని నిశ్శేషంగా అందించాను. వీటివల్ల గూడా వివేకం పొందలేని వారు వుంటే ఇంతకుమించి వారివిషయంలో చెయ్య గలిగే దేముంటుంది?

ఆదిశంకరు లీ మాట లనడంతో వెంటవున్న శిష్యు లందరికీ ఎవరి నుద్దేశించి అంటున్నారో తెలియక ఆందోళన కలిగింది. ఆ మహానుభావు లీ మాటలను ఏ ఒకరినో ఉద్దేశించి అనాలని అని వుండరు. తాము చేసిన ఉపదేశం సర్వసమగ్రమైన దన్న తాత్పర్యంతోనే అని వుంటారు. అయినా శిష్యు లందరూ గురుభక్తి భరితులూ, శ్రద్ధావంతులూ అవడంచేత ఇవి తమ్మగురించే అన్నారని అనుకుని తమ తమ పరిస్థితులనుబట్టి తాము గ్రహించిన ఆచార్యోపదేశ సారాన్ని ఉద్ఘాటిస్తూ ఒక్కొక్కరే తమ తమ సాధనాదీక్షను వ్యక్తం చెయ్యసాగారు.

మొదటి శిష్యు డిలా అన్నాడు:

జటిలో ముండీ లుంఛిత కేశః
కాషాయాంబర బహుకృత వేషః,
పశ్యన్నపి చ న పశ్యతి మూఢో
హ్యుదర నిమిత్తో బహుకృత వేషః. 14

జటిలః=జడలు పెంచుకొన్నవాడు, ముండీ=బోడిచేసి కొన్నవాడు, లుంఛిత కేశః=కుదురు ఊడివచ్చునట్లు వెంట్రుకలు పెరుకుకొనినవాడు, కాషాయాంబర= కాషాయవస్త్రములతో, బహు=అనేకవిధములుగా, కృతవేషః=వేషము ధరించినవాడు, మూఢః=మూఢు డయినప్పుడు, పశ్యన్నపి చ=స్పష్టంగా కనిపిస్తున్నప్పటికీ, న పశ్యతి= గ్రహించవే గ్రహించడు. బహుకృత వేషః=రకరకాలుగా వేయబడే వేషాలన్నీ, ఉదర నిమిత్తః=పొట్టనిమిత్తమే, హి=కదా!

సన్న్యాసం స్వీకరించి వేషం మార్చినంత మాత్రాన వివేకం కలిగింద నుకోవడం వట్టి భ్రాంతి. విద్వత్సన్న్యాసు లాది శంకరుల వంటివారు సకృత్తుగా ఎక్కడో ఉంటారు. సన్న్యాస స్వీకరణానికి ముందే వారు తత్త్వవేత్తలై శాస్త్ర విధియందలి గౌరవంతో సక్రమ సన్న్యాస స్వీకారంచేసి నిరంతర బ్రహ్మానుసంధానపరులై కాలక్షేపం చేయడమో లేక ప్రారబ్ధా న్ననుసరించి లోకసంగ్రహ తత్పరులై గ్రంథ నిర్మాణాదులతోనో, శిష్యోపదేశా లతోనో దేహయాత్ర నడుపుతూ వుంటారు. తక్కిన వారందరూ వివిదిషా సన్న్యాసులే. అంటే గార్హస్థ్యంలోవున్న కర్మబాహుళ్యంతో తత్త్వచింతన చెయ్యడానికి విశ్రాంతి వుండదని, తగినంత వైరాగ్య మేర్పడింది కాబట్టి, తెలుసుకోవాలన్న ఇచ్ఛతోనే సన్న్యసించి తన్మూలంగా లభించిన విశ్రాంతితో సాధనలు చేస్తూ వుంటారు. మూఢమైన అజ్ఞలోకానికి ఎవరు వేషధారి సన్న్యాసులో, ఎవరు నిజమైన సన్న్యాసులో తెలియదు. కాషాయ వస్త్రాలు కనిపించినంత మాత్రంతో నిజమైన సన్న్యాసులే అని సాష్టాంగ పడుతూ ఉండడం వారి స్వభావం. లోకం తమ యెడల చూపుచున్న గౌరవాన్ని బట్టైనా తాము ధరించిన వేషానికి తగ్గట్లు ప్రవర్తించాలని మూఢులైన వేషధారులూ అనుకోరు. సాధనలుచేసి తత్త్వాన్ని గ్రహించే ప్రయత్నం చేయరు. తానట్టి మూఢుడు కాడని ఈ మొదటి శిష్యుని తాత్పర్యం. "తమ

అనుగ్రహంవల్ల నాకు సన్న్యాసమయితే లభించింది. నే నింకా చేయవలసిన సాధన ఎంతో వున్నది. దాన్ని శ్రద్ధాభక్తులతో చేస్తూనే వున్నాను. తమ అనుగ్రహం వల్లనే ఎప్పటికైనా తత్త్వవేత్త నవుతా నన్న నమ్మకం నాకున్నది. లోకం నా యెడల చూపుతున్న గౌరవానికి నేను పొంగిపోవడం లేదు. జడలు కట్టించుకున్నా, తలబోడి చేసుకున్నా, వెంట్రుకలు పెరికి వేసుకున్నా, కాషాయవస్త్రాలు ధరించినా ఇవన్నీ పై వేషాలు మాత్రమే. కూటికొరకే కోటి వేషాలని ఇవన్నీ పొట్టకూటికి వేసేవే! ప్రజల మూఢత నాధారం చేసుకుని రోజు గడిస్తే చాలని నే ననుకోవడంలేదు. నాకు లభించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పరమార్థా న్నందుకోవడానికి సర్వాత్మనా ప్రయత్నిస్తూనే ఉన్నాను."

మొదటి శిష్యు డిలా అన్నాక వయసులో చాలా వృద్ధుడైన మరొక శిష్యుడు శంకరుల కభిముఖుడై ఇలా అన్నాడు.

అంగం గళితం పలితం ముండం
దశన విహీనం జాతం తుండమ్,
వృద్ధో యాతి గృహీత్వా దండం
తదపి న ముంచ త్యాశా పిండమ్. 15

అంగం=శరీరము, గళితం=శిథిలమైనది, ముండం=తల, పలితం=నెరసిపోయింది, తుండం=ముఖము, దశన విహీనం=పళ్ళూడిపోయినదిగా, జాతం=అయినది, దండం=కర్రను, గృహీత్వా=పుచ్చుకొని, వృద్ధః=ముసలివాడయి, యాతి=వెళ్ళుచున్నాడు, తత్+అపి=అయినప్పటికీ, ఆశాపిండం=కోరికలమూటను, న ముంచతి=విడిచిపెట్టుట లేదు.

స్వామీ! శరీరం శిథిలమైంది. తల నెరిసిపోయింది. పళ్ళన్నీ ఊడిపోయాయి. వార్ధక్యంవల్ల కర్ర పుచ్చుకునే నడవవలసివస్తోంది. అయితే ఏం? ఆశమాత్ర మింకా పీడిస్తూనే వున్నది. 'తృష్ణైకా తరుణాయతే' అని పెద్ద లన్నమాట వ్యర్థ మవుతుందా? అన్నీ ముసలితనాన్ని పొందుతాయి గాని కాలం గడిచినకొద్దీ తృష్ణకు మాత్రం పడుచుదనమే మిట్టిపడుతూ వేధిస్తూనే వున్నది. తా ముపదేశించిన మార్గాన్ని అనుసరించి దాన్ని

విచ్ఛించే ప్రయత్నం నేను శ్రద్ధాభక్తులతో చేస్తూనే వున్నాను. ఎప్పటికైనా మీవాత్సల్యవిశేషంతోనే నేను దాన్ని కోసివేయ గలగాలి.

అంటే ఆశాపాశ విచ్ఛేదనానికి వట్టి ముదిమి హేతువు కాదు. తత్త్వవివేచనంతోడి వైరాగ్యమూ, గుర్వనుగ్రహమూ తోడ్పడినప్పుడే దాన్ని తెంపుకోగలుగుతారు. వట్టి ముసలితనం దాన్ని నిర్మూలించడానికి సమర్థం కానట్టే మొండితనమూ సమర్థం కాదు. ఆ సంగతినే మరొక శిష్యుడు స్పష్టం చేస్తున్నాడు.

అగ్రే వహ్నిః పృష్ఠే భానూ
రాత్రౌ చిబుక సమర్పితజానుః,
కరతల భిక్ష స్తరుతలవాసః
తదపి న ముంచ త్యాశాపాశః. 16

అగ్రే=ఎట్టెదుట, వహ్నిః=చలిమంట, పృష్ఠే=వీపుమీద, భానుః=సూర్యుని వెలుగు, రాత్రౌ=రాత్రులయందు, చిబుక=గడ్డమునందు, సమర్పిత=చేర్చబడిన, జానుః=మోకాలు, కరతలభిక్షః=దోసిట్లోనే భిక్ష పెట్టించుకోవడం, తరుతల వాసః=చెట్టుక్రిందే నివసించడం, తత్+అపి=అట్లయినప్పటికీ, ఆశాపాశః=కోరికలనే కట్టుతాళ్లు, న ముంచతి=విడిచిపెట్టడం లేదు.

స్వామీ! ఈ ఆశాపాశ మెంత బలీయమైనదో అర్థం కావడం లేదు. వట్టి గోచిపాత రాయుణ్ణై కప్పుకోవడానికి వేరే గుడ్డ పాతైనా వుపయోగించకుండా కాలక్షేపం చేస్తున్నాను. ఎదుటనున్న చలిమంటతో కొంతసేపు, వీపున పడుతున్న సూర్యుని వేడిమితో కొంత సేపూ పగళ్ళు నడుస్తున్నాయి. రాత్రిళ్ళు మోకాళ్లు గడ్డాని కానించి మూడంకెవేసి ముడుచుకు పడుకోవడంతో సరిపోతున్నది. చెట్టునీడే నివాసస్థానంగా, లభించిన భిక్షకు దోసిలియే భాజనంగా కాలం గడుస్తోంది. అయినప్పటికి ఆశాపాశ మింకా దృఢంగానే వుంటున్నది. నా వైరాగ్య మింకా పరిపక్వత నందుకోలేదు. అది తీ [illegible] లక్ష్యసిద్ధి నందుకో[illegible]నికి తమ అనుగ్రహమే తోడ్పడాలి.

తరువాతి శిష్యునకు తీర్థయాత్రాభిమాన మున్నది. ఏవేవో వ్రతాలనూ ఎల్లప్పుడూ పాటిస్తూ వుంటాడు. ఆయన ఆచార్యులవారి సమక్షానికి వచ్చి ఇలా అన్నాడు.

కురుతే గంగా సాగర గమనం
వ్రత పరిపాలన మథ వా దానమ్,
జ్ఞాన విహీన స్సర్వ మతేన
ముక్తిం న భజతి జన్మ శతేన. 17

గంగా=గంగానదికీ, సాగర=సముద్రమునకూ (లేదా రెండూ కలియుచోటునకు), గమనమ్=వెళ్ళివచ్చుటను, కురుతే=చేయును, వ్రతపరిపాలనం=వ్రతముల నను ష్ఠించుటను, అథ వా=కానిచో, దానం=అన్ని విధములైన దానములను (చేయును) (అయినప్పటికీ) సర్వమతేన=అన్నిమతముల ప్రకారముకూడ, జ్ఞాన విహీనః=పరమార్థ జ్ఞానము పొందనివాడు, జన్మ శతేన=నూరు జన్మ లెత్తినప్పటికిన్నీ, ముక్తిం=మోక్షమును, న భజతి=పొందజాలడు.

గంగా సాగర సంగమస్థానంలో లేక కాశినుండి రామేశ్వరానికీ, రామేశ్వరంనుండి కాశికీ మధ్యనున్న పుణ్యతీర్థాలన్నీ సేవించుకుంటూ ఎన్నిసార్లయినా తిరిగి రావచ్చు. కఠోరదీక్షతో ఎన్ని తీవ్రవ్రతాలైనా పాలించి వుండవచ్చు. ఎన్ని దానాలైన చేసివుండవచ్చు. ఇవి ఏవీ ఏ మతం ప్రకారమూ సరాసరి ముక్తి హేతువులు కావు. అపరోక్షానుభూతి పూర్వకమైన ఆత్మజ్ఞానంవల్లనే ముక్తి లభించాలి. ఆ సిద్ధి పొందనంతవరకూ వంద జన్మ లెత్తినా ముక్తి లభించదు.

అప్పు డాచార్యులవారు నీ వే మంటావన్నట్లు మరొక శిష్యుని వంక చూచారు. అతడు సంపూర్ణవైరాగ్యసిద్ధి నందిన ధన్యుడు.

సురమందిర తరుమూల నివాసః
శయ్యా భూతల మజినం వాసః,
సర్వ పరిగ్రహ భోగత్యాగః
కస్య సుఖం న కరోతి విరాగః. 18

సురమందిర=దేవాలయమునందలి, తరు=చెట్టుయొక్క, మూల=బోదెవద్ద, నివాసః=మకాము, భూతల=నేలయే, శయ్యా=నిద్రపోవుటకు ప్రక్క, అజినం=తోలే, వాసః=మొలకు చుట్టుకొను గుడ్డ,సర్వ=సమస్తమైన, పరిగ్రహ=గ్రహించినవానిని దాచు కొనుట యొక్కయు, భోగ=అనుభవించుటయొక్కయు, త్యాగః=విడిచిపెట్టుట (ఇట్టి), విరాగః=బ్రహ్మమునందుతప్ప మరిదేనియందు రాగము లేకపోవుట, కస్య=ఎవనికి, సుఖం=సుఖమును, న కరోతి=చేయదు (చేయునని భావము).

అయ్యా! దేవాలయంలో చెట్టుకింద పడివుంటాను. భగవంతుడేర్పరచిన సిద్ధశయ్య భూమి వుండనే వున్నది పడుకోవడానికి. కృష్ణాజినం మొలకు చుట్టి మానగోపనం చేసుకుంటాను. లభించిన దానితో ఆకలి తీర్చుకుని ఎక్కువవుంటే ఎవరికైనా ఇచ్చివేస్తాను. నాకే భోగం మీద ఆశలేదు. ఇట్టి విరాగభావం ఎవరికైనా సుఖాన్నే కలిగిస్తుంది!

శ్రీశంకరులు సంతోషించి మరొక శిష్యునివంక చూశారు. ఆయన ఇంకా పరిణతుడు.

యోగరతో వా భోగరతో వా
సంగరతో వా సంగవిహీనః,
యస్య బ్రహ్మణి రమతే చిత్తం
నందతి నందతి నందత్యేవ. 19

యోగరతః=యోగమునం దాసక్తుడైనను, వా=లేదా, భోగరతః=భోగములం దాస క్తుడైనను, వా=లేదా, సంగరతః=కలిసియుండుటలో ఇష్టపడుచున్నను, వా=లేదా, సంగవిహీనః=ఎవరి సంబంధమును లేక ఏకాంతముగా నున్నను, యస్య=ఎవనికి, చిత్తం=మనస్సు, బ్రహ్మణి=పరబ్రహ్మమునందే, రమతే=రమించుచున్నదో (అట్టివాడు), నందతి=ఆనందించుచుండును, నందతి=ఆనందించుచుండును, నందతి+ఏవ=ఆనంద మునే పొందు చుండును.

ఎవనిచిత్తము బ్రహ్మమునందే రమిస్తూ వుంటుందో అట్టివాడు యోగ రతుడైననేమి? భోగరతుడైననేమి? సంగరతుడైననేమి? సంగహీనుడైన నేమి? అత డెప్పుడూ బ్రహ్మానంద సాగరంలో తేలియాడుతూనే ఉంటాడు.

అంతర్ముఖుడైన ఆ మహానుభావునకు బాహ్యపరిస్థితు లెలా వున్నా అవి వాని నంటనే అంటవు.

ఈ శిష్యు డిలా స్వానుభవాన్ని ప్రకటిస్తున్నప్పుడు అక్కడ చేరిన వాళ్ళల్లో ఒక జిజ్ఞాసువు 'స్వామీ! అట్టి బ్రహ్మానందానుభూతి ఎలా కలుగుతుంది?' అని ప్రశ్నించాడు. దానికి సమాధానంగా మరొక శిష్యుడు అది చాలా తేలికే అన్నట్లు ఇలా అన్నాడు.

భగవద్గీతా కించి దధీతా
గంగాజల లవకణికా పీతా,
సకృదపి యేన మురారి సమర్చా
క్రియతే తస్య యమేన న చర్చా. 20

భగవద్గీతా=భగవద్గీత, కించిత్=కొంచెముగా, అధీతా=అధ్యయనము చేయబడినదో, గంగా=గంగానదియందలి, జల=నీటియొక్క, లవ=లేశముయొక్క, కణికా=ఒక చుక్క, పీతా=క్రోలబడినదో, యేన=ఎవనిచేత, సకృదపి=జీవితములో నొక్క మారైనను, మురారిసమర్చా=విష్ణుపూజ, క్రియతే=చేయబడుచున్నదో, తస్య=వానికి, యమేన=యమునితో, చర్చా=సంభాషణము, న=లేదు.

ఎవడు కొంచెమైనా భగవద్గీత నధ్యయనం చేశాడో, ఎవడు పవిత్ర గంగాజలాన్ని బిందుమాత్రంగానైనా పుచ్చుకున్నాడో, ఎవడు మురారి సమర్చ నొక్కమారైనా నిర్వర్తించాడో అట్టివాణ్ణిగూర్చి యము డే మాత్రమూ పట్టించుకోడయ్యా అన్నాడు. అంటే వాడు మృత్యుంజయుడే అవుతాడు. కాబట్టి ఎల్లప్పుడూ బ్రహ్మానందమగ్నుడే అయి ఉంటాడని ఆయన తాత్పర్యం.

ఈ శిష్యుని హృదయం గంభీరమైనది. భగవద్గీత కొంచె మధ్యయనం చెయ్యడ మేమిటి? పద్దెనిమి దధ్యాయాలనూ కంఠస్థంచేసి నిద్రలో లేపినా అర్థతాత్పర్యాలతో అప్పచెప్పేవాళ్ళు ఎంతోమంది వుంటున్నారు. గంగాజలాన్ని బిందెలు బిందెలు క్రోలినవాళ్ళున్నారు. నిత్యమూ పంచాయతనపూజలో సాలగ్రామ విష్ణ్వర్చన చేస్తున్నవాళ్ళున్నారు. వీ ళ్ళందరూ జీవన్ముక్తులైన ట్లేనా? జీవన్ముక్తి అంత తేలికనుకోవడానికి ఏ మాత్రమూ అవకాశం లేదు.

భగవద్గీత పద్దెనిమిదధ్యాయాలు అప్పచెప్తే ప్రయోజన మేమీలేదు. అది జీవన విధానాన్ని శాసించే యోగశాస్త్రం. ఆ శాస్త్ర రహస్యం ఏ కొంచెం తెలిసి నిత్యానుష్ఠానంలో ఉంచుకోగలిగినా జీవుడు తప్పక తరిస్తాడు. అలాగే గంగాజలం ఎతం పుచ్చుకున్నారన్నది కాదు ప్రశ్న. జ్ఞానగంగా ప్రసాదం బిందుమాత్రమే పొందగలిగినా జీవుడు ధన్యుడవుతాడు. ఆవరణవిచ్ఛేదమై హృద్గుహాకవాటాలు తెరుచుకొని లోనున్న మురారిని జీవితంలో ఒక్కమారు దర్శించుకోగలిగినా వాడు జీవన్ముక్తుడే అవుతాడు. ఈ సిద్ధి గుర్వనుగ్రహప్రాప్త దీక్షాదార్ఢ్యంతో నిర్విరామ కృషివల్ల రావలసిందే గాని పై పై మాటలతో వచ్చేది ఎన్నడూ కాదు.

ఈ శిష్యుని ప్రవచనం విని ఆ జిజ్ఞాసువు తెల్లబోయి చూస్తుంటే మరొక శిష్యు డిలా అన్నాడు..

> పునరపి జననం పునరపి మరణం
> పునరపి జననీజఠరే శయనమ్,
> ఇహ సంసారే బహుదుస్తారే
> కృపయాఽఽపారే పాహి మురారే. 21

పునః+అపి=తిరిగి తిరిగి, జననం=పుట్టుక, పునః+అపి=తిరిగి తిరిగి, జననీ=తల్లియొక్క, జఠరే=కడుపులో, శయనం=నిద్రించుచుండుట (వీనితోకూడిన), బహుదుస్తారే=తరించుటకు మిక్కిలి కష్టమైన, ఇహ సంసారే=ఈ సంసారసాగరమునుండి, అపారే=పారములేని దానినుండి, మురారే=హే మురాంతకా! శ్రీమహావిష్ణూ! కృపయా=దయతో, పాహి=రక్షింపుము.

బాబూ! ఎందు కలా వెల్వెల బోతావు?

పుట్టుకా చావూ, పుట్టుకా చావూ, మళ్లీ మళ్లీ మాతృ గర్భంలో శయనిస్తూ వుండడం ఇది ఈ సంసార లక్షణం. దీన్ని తరించడం అంత సులభం కాదు. అయితే ఏం? భగవంతు డపారమైన కృపగలవాడు. అచ్ఛమైన భక్తిశ్రద్ధలతో పాహి మురారీ! అని ఆయన్ను ఆశ్రయిస్తే ఆయన తప్పక అనుగ్రహిస్తాడు. భక్తిని మించిన తరణోపాయం మానవులకు మరొకటి లేదు. అచ్ఛమైన భక్తి దేన్నైనా సిద్ధింప చేస్తుంది.

శ్రీశంకరుల దృష్టిలో భక్తి అద్వైతానికి విరుద్ధమైనది కాదు. "స్వస్వ రూపానుసంధానం భక్తి రిత్యభిధీయతే" అని వారి నిర్వచనం.

లోకేఽస్మిన్ ద్వివిధా నిష్ఠా
పురా ప్రోక్తా మయాఽనఘ,
జ్ఞాన యోగేన సాంఖ్యానాం
కర్మయోగేన యోగినామ్.

అన్న గీతాచార్యుడు రెండే రెండు నిష్ఠలు తాను పూర్వ ముపదేశించినవి వున్నాయంటూ అవి సాంఖ్యులకు జ్ఞానయోగమనీ, యోగులకు కర్మయోగమనీ కర్మజ్ఞానాలను మాత్రమే పేర్కొనడంలో తాత్పర్యమేమిటి? భక్తియోగ మేమైనట్లు? ఆత్మరూపుడైన భగవంతునియందు పరాప్రేమ రూపమైన భక్తి ఈ రెండు మార్గాలలోనూ అంతర్లీనమై వుండనే వుంటుంది. ఆ భక్తి లేనప్పుడు జ్ఞానమూ శుష్కమే, కర్మా వ్యర్థమే! అలాగని భక్తి పేరుతో ఈశ్వరాజ్ఞారూపమైన నియతకర్మ ననుష్ఠించకపోవడం యజమానుని స్తోత్రం చేస్తూ ఆయన చెప్పిన పని చెయ్యని కింకరుని ప్రవర్తన వంటిదే అవుతుంది. అందుకనే గీతాచార్యుడు తన కే అవసరమూ లేకపోయినా తాను తన నియతకర్మను భక్తిశ్రద్ధలతో చేస్తున్నట్లూ నీవు జ్ఞాని వనుకున్నా లోక సంగ్రహ దృష్టితోనైనా నియత కర్మ చేస్తూనే వుండవలసిందనీ అర్జునున కుపదేశించాడు.

'పాహి మురారే' అని భక్త్యుపదేశం చేసిన శిష్యునకు ప్రక్కనున్న శిష్యుడు ఎల్లప్పుడూ అంతర్ముఖుడై వుండే అవధూత. ఆయన ఆ సమయంలో బహిర్ముఖుడై వీరి మాటలు విన్నాడు కాబోలు! ఇలా అన్నాడు:

రథ్యా చర్పట విరచిత కన్థః
పుణ్యాపుణ్య వివర్జిత పన్థః,
యోగీ యోగ నియోజిత చిత్తో
రమతే బాలోన్మత్తవ దేవ. 22

రథ్యా=వీథులయందలి, చర్పట=గుడ్డ పేలికలతో, విరచిత=కూర్చబడిన, కంథః=బొంతగలవాడు, పుణ్యా=పుణ్యమును, అపుణ్యా=పాపమును, వివర్జిత=విడిచివేసిన,

పంథః-మార్గముగలవాడు, యోగ-యోగముచేత, నియోజిత-నియమితముగుచున్న, చిత్తః=మనస్సుగల, యోగీ=ఆత్మనిష్ఠుడైన యోగి, బాల+ఉన్మత్త+వత్+ఏవ=పసిపిల్లవానివలె, పిచ్చియెక్కిన వానివలె, రమతే=తనయందే తా నానందించు చుండును.

యోగంచేత చిత్తాన్ని తన అధీనం చేసుకున్న యోగికి ఈ లోకంలో కావలసిన దేమీలేదు. వీథుల్లో పడివుండే గుడ్డపేలికలతోనే ఆయన బొంత కుట్టుకుని కప్పుకుంటాడు. దొరికిన భిక్షంతో శరీరాన్ని ధరిస్తూ పుణ్యాపుణ్యాల కతీతమైన మార్గాన్ని అనుసరిస్తాడు. పసిపిల్లవానివలె, పిచ్చివానివలె లోకదర్శనం చెయ్యక ఆత్మైక దర్శనంతో ఆనందిస్తూనే వుంటాడు.

అట్టి అవధూత స్థితి నందుకోవడం చాలా కష్టం. ఎన్నో జన్మల సాధనతో ఏ చరమ శరీరంలోనో ఆ పరిపక్వత రావచ్చు. అంతవరకూ ఊరికే కూర్చోగూడదు. బుద్ధిపాటవం కలవాళ్లు శాస్త్రమార్గాన్ని అనుసరించి తత్త్వవిచారం చెయ్యాలి.

కస్త్వం కోఽహం కుత ఆయాతః
కా మే జననీ కో మే తాతః,
ఇతి పరిభావయ నిజసంసారం
సర్వం త్యక్త్వా స్వప్నవిచారః. 23

త్వం=నీవు, కః=ఎవరు? అహం=నేను, కః=ఎవరు? కుతః=ఎక్కడనుండి, ఆయాతః=వచ్చినవాడవు? మే=నాయొక్క, జననీ=తల్లి, కా=ఎవరు? మే=నాయొక్క, తాతః=తండ్రి, కః=ఎవరు? ఇతి=ఈ విధముగా, నిజసంసారం=స్వీయమైన సంసారమును, స్వప్నవిచారః=కలగనుటవంటి దానిని, సర్వం=సమస్తమును, త్యక్త్వా=విడిచిపెట్టి, పరిభావయ=లెస్సగా విచారించుము.

ఆలోచనచేస్తే ఈ సంసారంలో నిలిచేదే మీలేదు. నీ వెవరు, నే నెవరు, ఎక్కడనుండి వచ్చాము, నా తల్లి ఎవరు? తండ్రి ఎవరు? ఈ ప్రశ్నలకు సమాధానా లన్వేషిస్తే ఈ సంసార బంధాలన్నీ మిథ్యాకల్పితాలని తేలిపోతుంది. నీవూ నేనూ అని మనం వ్యవహరిస్తున్నవి ప్రస్తుతం కనిపిస్తున్న శరీరాలను గురించి. అల్లాగే తల్లి తండ్రీ అని మనం భావిస్తున్న వాళ్ళు ప్రస్తుతం కనిపిస్తున్న ఈ శరీరానికి కారకులైన వాళ్ళు. ఈ శరీర

మిప్పుడున్నది కాని ఇది లేనప్పుడూ మన మున్నాము కదా! అప్పుడు వేరే శరీరాలతో వుండివుంటాము. వాటికీ తల్లిదండ్రులుండి వుండాలి కదా! ఇల్లా విచారిస్తే మన కెన్నికోట్ల తల్లిదండ్రులున్నారో! వీరిలో మన మెవరిని నిజ మనుకోవాలి? స్వప్నదృష్ట పదార్థాలు అవి కనిపిస్తునంతసేపూ నిజమైనట్లే. ఇవీ అప్పటి కప్పుడే నిజాలు కాని ఎల్లప్పుడూ నిజాలు కావు. వివేక దృష్టికి ఆత్మ ఒక్కటే సత్యం. తక్కిన దంతా మిథ్యాభూతమే. కాబట్టి నీడలవంటి ఈ శరీరాలను పురస్కరించుకుని మోహాలు పెంచుకోవడం ఎంత అవివేకం?

త్వయి మయి సర్వత్రైకో విష్ణుః
వ్యర్థం కుప్యసి మయ్యసహిష్ణుః,
భవ సమచిత్త స్సర్వత్ర త్వం
వాంఛ స్యచిరా ద్యది విష్ణుత్వమ్. 24

త్వయి=నీయందును, మయి=నాయందును, సర్వత్ర=అన్నిటియందును, విష్ణుః= విష్ణువు, ఏకః=ఒక్కడే. మయి=నాయందు, అసహిష్ణుః=సహింపలేనివాడవై, వ్యర్థం= అనవసరముగా, కుప్యసి=కోపించుకొనుచున్నావు. త్వం=నీవు, అచిరాత్=త్వరలోనే, విష్ణుత్వం=సర్వవ్యాపియైన విష్ణుభావమును, వాంఛసి+యది=కోరుచున్నవాడవయి నట్ల యితే, సర్వత్ర=సమస్తమునందును, సమచిత్తః=సమమైన చిత్తము కలవాడవు, భవ= కమ్ము.

బాబూ! నే నెప్పుడూ ఒకేమాట చెప్తున్నాను. ఎప్పుడూ ఒకేమాట చెప్తున్నానని సహనాన్ని కొల్పోయి నామీద అనవసరంగా కోపాన్ని ప్రదర్శించకు. జాగ్రత్తగా విచారిస్తే నీలో నాలో అంతటా వున్నది ఒకే విష్ణువు. ఆయన కా పేరు అలా సర్వవ్యాపి కావడం చేతనే వచ్చింది. అన్నిటా వున్నది ఆయనే అయినప్పుడు ఒకరు నా వారని, మరొకరు కారనీ అనుకోవడంలో అర్థ మేమున్నది? అందుచేత నీవు నామాట విని త్వరలోనే నీవు విష్ణుత్వం పొందాలని వాంఛించే టట్లయితే పిపీలికాది బ్రహ్మపర్యంతం సర్వసృష్టియందూ సమచిత్తుడవుకా!

అది ఎలా కుదురుతుందని సందేహించకు.

శత్రౌ మిత్రే పుత్రే బంధౌ
మా కురు యత్నం విగ్రహసంధౌ,
సర్వస్మి న్నపి పశ్యాత్మానం
సర్వత్రో త్సృజ భేదాజ్ఞానమ్. 25

శత్రౌ=శత్రువునందును, మిత్రే=మిత్రునియందును, పుత్రే=పుత్రుని యందును, బంధౌ=బంధువునందును, విగ్రహసంధౌ=కలహించుట, సంధిచేసుకొనుట మొదలైనవానికి, యత్నం=ప్రయత్నమును, మా కురు=చేయకుము. సర్వస్మిన్+అపి=అందరియందును, ఆత్మానం=ఆత్మనే, నిన్నే, పశ్య=చూచినవాడవై, సర్వత్ర=అన్నిటియందును, భేద+అజ్ఞానం,=భేదరూపమైన అజ్ఞానమును, ఉత్సృజ=పెకలించివేయుము.

నీ కొకడు శత్రు వనిపిస్తున్నాడనుకో. అట్టివానితో కలహించాలని ప్రయత్నించకు. మరొకడు మిత్రు డనిపిస్తున్నాడు. వానితో పెన వేసుకుని తిరగబోకు. ఆ శత్రువునందూ, ఈ మిత్రునియందూ ఆత్మనే దర్శించు. అలాగే అందరియందూ ఆత్మనే చూడు. అంటే నీయందున్న ఆత్మయే అందరియందూ వున్నదని గుర్తించు. అప్పుడు నీతోనే నీవు కలహించడంగాని నిన్నే నీవు పెనవేసుకోవడం గాని వుండదు గదా! ఈ విధంగా సర్వత్రా ఆత్మదర్శనం చేసి అజ్ఞానమూలకమైన భేద భావాన్ని పెకలించి వేసెయ్యి. అప్పుడు నీకు నిశ్చింత. అది ఎంత హాయినిస్తుందో ఆలోచించుకో!

అలా సమచిత్తాన్ని సాధించిన వానికి అంతశ్శత్రువు లుండనే ఉండరు.

కామం క్రోధం లోభం మోహం
త్యక్త్వా ఽఽత్మానం పశ్యతి సోఽహమ్,
ఆత్మజ్ఞాన విహీనా మూఢాః
తే పచ్యన్తే నరక నిగూఢాః. 26

కామం=కామమును, క్రోధం=కోపమును, లోభం=దురాశను, మోహం=మోహమును, త్యక్త్వా=విడిచి, సోఽహం=నేనే ఆ పరమాత్మను అని (వివేకియైనవాడు), ఆత్మానం=ఆత్మను, పశ్యతి=చూచుచున్నాడు. ఆత్మజ్ఞాన విహీనాః=ఆత్మజ్ఞానములేని, తే మూఢాః=ఆ అవివేకులైనవారు, నరకనిగూఢాః=తెలియరాని ఘోరనరకములలో, పచ్యన్తే=వేగుచున్నారు.

అరిషడ్వర్గాన్ని జయించి అంతటా ఆత్మదర్శనం చేసేవాడే పరమాత్మ వేత్త. వానికే నిత్య నిరతిశయ సుఖస్వరూపమైన మోక్షప్రాప్తి. ఆత్మజ్ఞాన విహీనులైన మూఢులు తా మాచరించే పాపాలకు ఫలంగా నరకంలో యమకింకరులు పెట్టే బాధలకు గురికాక తప్పదు. మంగలాల్లో ఆముదాలు వేగినట్లు వేగక తప్పదు.

సమచిత్తతలో ఆత్మజ్ఞానివైన నిమ్మట ప్రారబ్ధవశాత్తూ శరీరమింకా నీ కున్నట్లయితే నువ్వేం చేయాలో తెలుసునా?

గేయం గీతా నామసహస్రం
ధ్యేయం శ్రీపతి రూప మజస్రమ్,
నేయం సజ్జనసంగే చిత్తం
దేయం దీనజనాయ చ విత్తమ్. 27

గీతా=భగవద్గీతయు, నామసహస్రం=విష్ణుసహస్రనామములును, గేయం=గానము చేయదగినవి. అజస్రం=ఎల్లప్పుడును, శ్రీపతిరూపం=లక్ష్మీపతి రూపము, ధ్యేయం=ధ్యానింపతగినది. చిత్తం=మనస్సు, సజ్జనసంగే=సజ్జనసాంగత్యమునందు, నేయం=చేర్పదగినది. విత్తం చ=ధనముయితే, దీనజనాయ=దీనులైన జనులకొరకు, దేయం=ఇవ్వదగినది.

ఎల్లప్పుడూ భగవద్గీతనూ, విష్ణుసహస్రనామాలనూ అర్థమననంతో గానం చేసుకుంటూ కాలక్షేపం చేయి. హృదయంలో నిర్విరామంగా విష్ణుస్వరూపం ధ్యానం చేసుకుంటూ ఉండు. చిత్తాన్ని సజ్జన సాంగత్యంలో నిమగ్నం చేసుకో. నన్ను చేరే విత్తాన్ని దీనజనుల కిస్తూవుండు. ఇలా శేషజీవితాన్ని పవిత్రంగా గడుపుకుంటూ వుంటే కలిగిన ఆత్మజ్ఞానం దృఢపడడమే కాక దేహ పతనానంతరం పునర్జన్మ రహితుడివే అవుతావు.

శిష్యు లిలా చెప్పిన పదునాలుగు శ్లోకాలకూ చతుర్దశమంజరికాస్తోత్ర మన్న వ్యవహార మున్నది.

ఈ విధంగా ఆచార్యోపదేశాన్ని అనుసరించి పదునలుగురు శిష్యులూ తమ తమ హృదయాల నావిష్కరించగా శ్రీశంకరులకు తమ శిష్యులు సరియైన మార్గంలోనే ఉన్నారుగదా అని తృప్తి కలిగింది. అయినా జ్ఞానదార్ఢ్యం నిమిత్తం వారు మరికొన్ని ఉపదేశాలు చేశారు.

సుఖతః క్రియతే రామాభోగః
పశ్చాద్ధంత శరీరే రోగః,
యద్యపి లోకే మరణం శరణం
తదపి న ముంచతి పాపాచరణమ్. 28

రామాభోగః=స్త్రీ సాంగత్యమును, సుఖతః=సుఖాపేక్షతో, క్రియతే=చేయుదురు. పశ్చాత్=తరువాత, హంత=అయ్యో!, శరీరే=శరీరమునందు, రోగః=రోగము ఏర్పడుచున్నది. లోకే=లోకమునందు, మరణం=చావే, శరణం=చివరికి చేరకతప్పనది; యద్యపి=అయినప్పటికీ, తదపి=అది తప్పదని తెలిసినప్పటికీ, పాపాచరణం=పాపములు చేయుటను, న ముంచతి=విడిచిపెట్టుట లేదు.

నాయనలారా! ఈ లోకమెంత అవివేకంగా ప్రవర్తిస్తుందో గమనించండి. సుఖం పేరుతో స్త్ర్యాదిభోగానికి తహతహలాడి శరీరాన్ని రోగగ్రస్తం చేసుకుంటుంది. చివరకు చావు తప్పదని తెలిసికూడా పాపాలు చెయ్యడం మానుకోదు. మన మంతా సన్న్యాసులమై స్త్రీ భోగదూరులం కావడంవల్ల నిజంగా ధన్యుల మయ్యాము. బ్రహ్మచర్యనిష్ఠులమై ఉంటున్నందువల్లనే మన శరీరాలు ఆరోగ్యంగా ఉంటున్నాయి. ఇతర భోగాలనుగూర్చి గూడా మన మెంత మాత్రమూ మోహితులం కాగూడదు. శరీరధారణమాత్రాని కన్యమైన సర్వభోగాలు మనకు నింద్యాలే.

అర్థ మనర్థం భావయ నిత్యం
నాస్తి తత స్సుఖలేశ స్సత్యమ్,
పుత్రాదపి ధనభాజాం భీతిః
సర్వత్రైషా విహితా రీతిః 29

నిత్యం=ఎల్లప్పుడును, అర్థం=అర్థమును, అనర్థం=అన్ని అనర్థములకు హేతువని, భావయ=భావించుము, తతః=దానినుండి, సుఖలేశః=కొంచెము సుఖమైనను, నాస్తి=లేదు; సత్యం=ఇది పూర్తిగా నిజము. ధనభాజాం=ధనము ప్రోగుచేసినవారికి, పుత్రాత్+అపి=కొడుకునుండిగూడా, భీతిః=భయము కలదు; ఏషా=ఈ విధమైన రీతిః=పద్ధతి, సర్వత్ర=అన్నిచోట్లయందును, విహితా=తప్పనిసరి అయివున్నది.

అర్థాన్ని సర్వానర్థ హేతువుగా నిత్యమూ భావించండి. నేను చెప్తున్నది ముమ్మాటికీ నిజం. అర్థంవల్ల లభించే సుఖం లేశమాత్రమైనా లేదు. ధనాన్ని గూర్చినవాడు కొడుకునుండిగూడా భయపడవలసి ఉంటుంది. దాని ఉద్భవంలోనే దాని కా పద్ధతి విహితమై సర్వే సర్వత్రా కనిపిస్తున్నది.

శ్రీశంకరులు ప్రకటించిన ఈ సత్యానికి వేరే రుజువు లక్కరలేదు. అన్ని దేశచరిత్రల్లోనూ అర్థకాంక్షతో తండ్రులనూ అన్నలనూ చంపి సింహాసనా లధిష్ఠించిన రాజులు సమృద్ధిగా కనిపిస్తున్నారు. అర్థ స్పర్శలే సహించలేకపోయిన శ్రీరామకృష్ణ పరమహంస దానివలని అనర్థాన్ని గుర్తించే ఆట్టి శరీరతత్త్వాన్ని పెంపొందించు కున్నారు. అర్థా నర్థాన్ని ఉద్ఘాటించే ఒక చిన్నకథ ఈ సందర్భంలో స్మృతికి వస్తున్నది.

ఒకానొక కొండగుహలో బంగారునాణాల కుప్పను చూచి 'అమ్మో! మృత్యువు; అమ్మో! మృత్యువు' అని అరుస్తూ ఒక సన్న్యాసి పారిపో సాగాడు. ఆ పరుగెత్తుతున్న సన్న్యాసిని ముగ్గురు బాటసారులు ఆపి 'ఏమి టయ్యా అలా పరుగెత్తుతున్నావు' అని ప్రశ్నించారు. 'నేను మృత్యువును చూశాను. అది వెంట పడుతుందేమో అని పరుగెత్తుతున్నా'నన్నాడు సన్న్యాసి. 'అరే! మృత్యువును చూశావా? అది నీకు కంటబడిందా? మనుషులు చావడ మెరుగుదుమే గాని వాళ్ళను చంపే మృత్యువును మే మెరుగమే? మాకు దాన్ని చూపిస్తావా?' అని అడిగారు వాళ్ళు. ఆ సన్న్యాసి వాళ్ళను తీసుకుపోయి గుహలో ధనరాశినిచూపి 'అదే మృత్యువు' అన్నాడు. వాళ్ళు లోలోపల నవ్వుకుంటూ పైకి భయపడ్డట్లు నటించి సన్న్యాసివెంట తాము కొంతదూరం వెళ్ళి తిరిగివచ్చి 'ఆ పిచ్చి సన్న్యాసి చూచాడు కాబట్టి సరిపోయింది. ఇంతకూ మనం అదృష్టవంతులం. లేకపోతే ఇది మనకు దక్కేదా' అనుకుంటూ ముగ్గురూ దాన్ని పంచుకోడానికి ఉప క్రమించారు. ఎంతసేపు పంచినా అది తరగనంత వుంది. చాలసేపయ్యాక అందరికీ ఆకలివేస్తుండడంవల్ల ఒకణ్ణి దగ్గరున్న ఊళ్ళోకి వెళ్ళి అన్నం పట్టుకు రావలసిందనీ, వాడు వచ్చేలోగా తక్కినవాళ్ళు పంచుతూ వుంటామని అనుకున్నారు. ఇట్టి ఊహ వచ్చినప్పుడు ఎవ్వరూ బయలుదేరి వెళ్ళకూడదు. ఎవడికి తాను తిరిగి వచ్చేలోగా తక్కినవాళ్ళు పరా రవుతారేమో అన్న

సందేహం కలగాలి? అట్టి సందేహం కలిగే ఒకడు అన్నం తేవడానికి సాహసించాడు. వాడు తాను కడుపునిండా తిని వాళ్ళకుతెచ్చే ఆహారంలో విషం కలిపితే వాళ్ళిద్దరూ చస్తారు గదా! ధన మంతా తనకే దక్కుతుందని ఆశపడి వెళ్లాడు. వాడు వెళ్ళాక వీళ్ళకూ దుర్బుద్ధి పుట్టింది. అన్నాన్ని తీసుకుని వాడు వచ్చే టప్పటికి ఇద్దరమూ కలిపి వాణ్ణి చంపినట్లయితే ధనమంతా ఇద్దరమే పంచుకోవచ్చుననుకున్నారు. అనుకున్న ప్రకారం వాడు రాగానే బడితెలతో చావమోది పీడ వదిలిం దనుకున్నారు. తెచ్చి నన్నం తిని సావకాశంగా పంచుకుందా మని వాడు తెచ్చిన విషాన్నం తిని వాళ్ళూ చచ్చారు. సన్న్యాసి అన్నట్లే అది ముగ్గురికీ మృత్యువే అయి తాను తానుగానే వుండిపోయింది. అర్థ మింత అనర్థకారి కావడంలో అతిశయోక్తి ఏ మాత్రమూ లేదు.

ఈ విధంగా ఉపక్రమణంలో అర్థకామాలను నిరసించినట్లే ఉప సంహారదశలోనూ వాటిని నిరసించి శ్రీశంకరులు కర్తవ్యోపదేశంచేస్తూ ఇలా అన్నారు.

ప్రాణాయామం ప్రత్యాహారం
నిత్యానిత్య వివేక విచారమ్,
జాప్య సమేత సమాధి విధానం
కుర్వవధానం మహదవధానమ్. 30

ప్రాణాయామం=ప్రాణవృత్తిని నియమించుట, ప్రత్యాహారం=చెదరుచున్న మనస్సును మళ్ళించి ధ్యేయమునందు నిలుపుట, నిత్య=నిత్యవస్తువునకును, అనిత్య=క్షణికములైన వానికినిగల వ్యత్యాసమును, వివేక=విచక్షణతో, విచారః=ఆలోచించుట, జాప్య సమేత=మంత్రజపముతో కూడిన, సమాధి విధానం=సమాధిస్థితి నందుకొనుపద్ధతిని, అవధానం=ఏకాగ్రతతో, మహదవధానం=గొప్పదైన ఏకాగ్రతతో, కురు=చేయుము.

మనసు దీపం వంటిది. ఉచ్ఛ్వాసనిశ్వాసాలు యథేచ్ఛగా సాగుతున్నప్పుడు అది గాలిలో దీపంలా చెదిరిపోతూ వుంటుంది. ప్రాణవృత్తి నియమనం చేయగలిగినప్పుడు అది నివాతదీపంలా ఏకాగ్ర మవుతుంది. ప్రాణాయామసిద్ధి నందిన గురువు సహాయం లేకుండా పుస్తకాలలో మాటలనుబట్టి

ఎవ్వరూ స్వతంత్రంగా ప్రాణాయామానికి పూనుకోగూడదు. జ్ఞానమార్గంలో దానికై ప్రత్యేక ప్రయత్న మక్కరలేదని భక్తి విశ్వాసాలతో తత్త్వవిచారణా, జపతపాలూ సాగిస్తున్నప్పుడు దాని అంతట అదే సిద్ధిస్తుందనీ పెద్దలంటారు. ధ్యేయవస్తువుమీద మనసు నిలవక అది ఇతర విషయాల మీదికి వెళ్తున్నప్పుడల్లా హెచ్చరికతో దాన్ని ప్రయత్నపూర్వకంగా మళ్ళించి మళ్ళీ మళ్ళీ ధ్యేయవస్తువుపై నిలుపుతూ వుండడమే ప్రత్యాహారం. మనస్స్వభావాన్నిబట్టి అది పూర్తిగా ఆగిపోవడం అసంభవం కాబట్టి అవిచ్ఛిన్న తైలధారవలె ధ్యేయవస్తువును గూర్చిన వృత్తిపరంపరయందు దాన్ని ఉంచుతూ ఉండడమే ధ్యానమనిపించుకుంటుంది. ధ్యానయోగసిద్ధి నందడమే అంటే ధ్యేయానికి భిన్నమైన వాటిని గూర్చిన వృత్తి పుట్టకుండా చేసుకోగలగడమే మనోనైశ్చల్య సిద్ధి అవుతుంది. నిత్యానిత్యవివేకంతో సర్వానిత్య పరిహారపూర్వక నిత్యాత్మనిష్ఠాపరుడై ఇష్టదేవతా మంత్రజప ధ్యానాలతో సమాధిస్థితి నందుకోగలగడమే కర్తవ్యం. దీనికి తొందరపడి ప్రయోజనం లేదు. ఎంతో జాగరూకతతో ఎంతో పట్టుదలతో దృఢవిశ్వాసంతో నియమనిష్ఠలతో బహుకాల కృషివలన సాధించవలసిన లక్ష్యమిది.

గురుచరణాంబుజ నిర్భర భక్తః
సంసారా దచిరా ద్భవ ముక్తః,
సేంద్రియ మానస నియమా దేవం
ద్రక్ష్యసి నిజహృదయస్థం దేవమ్. 31

గురు=ఆధ్యాత్మిక విజ్ఞానమునందించు సద్గురువుయొక్క, చరణ=పాదములనెడి, అంబుజ=పద్మములయందు, నిర్భర=నిండైన, భక్తః=భక్తుడవై, అచిరాత్=త్వరలోనే, సంసారాత్=సంసారమునుండి, ముక్తః=ముక్తుడవు, భవ=అగుము, స-ఇంద్రియ=ఇంద్రియములతో కూడిన, మానసః=మనస్సుయొక్క, నియమాత్-ఏవం=నియమించుటచేత మాత్రమే, నిజహృదయస్థం=నీ హృదయమునందే ఉన్న, దేవం=ఆత్మరూపుడైన పరమేశ్వరుని, ద్రక్ష్యసి=చూడగలవు.

గురు పాదపద్మములయందు తొణకని బెణకని నిండైన భక్తిగలవాడవై సంసారమునుండి త్వరలోనే విముక్తుడవు కా! ఇంద్రియములతో గూడిన

మనస్సును నియమించినందువల్లనే హృదయంలో ఉన్న ఆత్మతేజాన్ని చూడ గలుగుతావు.

పారమార్థిక విషయాల్లో గురుభక్తి లేనివాడు ఎంత కృషిచేసినా నిష్ప్రయోజనమే. 'యస్య దేవే పరా భక్తి ర్యథా దేవే తథా గురౌ' అన్నట్లు దేవునియందు గురువునందు నిరతిశయ దృఢభక్తి గల వానికే పరమార్థ సిద్ధి. గుర్వనుగ్రహ పాత్రుడైనవాడు త్వరలోనే సంసారంనుండి విముక్తి నందగలడు.

పరమార్థసాధనకు ఇంతకంటె సూటియైన ఉపదేశం ఇంకేమి ఉంటుంది. శ్రీశంకరులే అన్నట్లు దీనివల్ల వివేకం పొందలేనివారు దేనివల్లా పొందలేరు. శ్రీశంకర చిన్మయ శారదానుగ్రహ ప్రభావం వల్ల ఇది పాఠకులకు వివేకోద్భవ హేతువగు గాక.

* * *

T.T.D. Religious Publications Series No.320
Price Rs 5 -

శ్రీ శంకర భగవత్పాదులు ఉపనిషత్తులు, బ్రహ్మ సూత్రాలు, భగవద్గీతలకు భాష్యాలే కాక దైవభక్తిని పెంపొందించే అనేక స్తోత్రాలు రచించారు. వాటిల్లో 'భజగోవిందం' ప్రాచుర్యాన్ని పొందింది. 'భజ గోవింద శ్లోకాలు' అర్థ గాంభీర్యాల్లో, వైరాగ్య ప్రబోధంలో అత్యున్నతస్థానాన్ని అందుకొన్నవి. శ్రీచెఱకుపల్లి జమదగ్నిశర్మ ఈ శ్లోకాలను సర్వజన సుబోధకంగా అర్థ విశేషాలతో వివరించారు

Published by **Sri K.V. Ramanachary,** IAS Executive Officer
Tirumala Tirupati Devasthanams and Printed at Keerthi Offset
on behalf of T T D Devasthanams